ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం - 8లో

పేదల ఇంట పండగ

జిల్లాలో 13,569 ఇళ్లలో ప్రవేశాలు

- ఆయా నియోజకవర్గాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు



అనకాపల్లి పట్టణంలో నాగరత్నంకు ఇంటి తాళం నమూనాను అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పేదల నూతన గృహ ప్రవేశాలు పండగలా జరిగాయి. బుధవారం జిల్లాలో 13,569 గృహ ప్రవేశాలను అట్టహాసంగా నిర్వహించారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలో 13,569 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసింది. దీంతో బుధవారం గృహ ప్రవేశాలు జరిగాయి. అనకాపల్లిలో 3,200, నర్సీపట్నంలో 2,241, చోడవరంలో 1,612, మాడుగులలో 2,152, ఎలమంచిలిలో 996, పాయకరావుపేటలో 2,946, పెందుర్తిలో 422 గృహ ప్రవేశాల కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అనకాపల్లి మండలంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జేసీ జాహ్నవి హాజరై లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో జరిగిన సామూహిక గృహ ప్రవేశాలకు హోం మంత్రి వంగలపూడి అనిత హాజరయ్యారు. మాడుగుల నియోజకవర్గ పరిధిలో పోతనపూడి అగ్రహారంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ హాజరయ్యారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు అందుబాటులో లేనందున గృహప్రవేశాల కార్యక్రమాన్ని వాయిదా వేశారు. చోడవరం నియోజకవర్గంలో గృహ ప్రవేశాలు జరగలేదు. ఒకటి రెండు రోజుల్లో ఆయా నియోజకవర్గాల్లోనూ గృహ ప్రవేశాలు జరపనున్నట్టు గృహ నిర్మాణ సంస్థ అధికారులు తెలిపారు.

2029 నాటికి పేదలందరికీ పక్కా ఇళ్లు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



అనకాపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బుధవారం పట్టణంలో ఆడారి నాగరత్నంకు ఇంటి తాళం నమూనాను అందజేసి గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు మూడు లక్షల ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందించడం సంతోషంగా ఉందన్నారు. సొంత స్థలం ఉన్నవారికి ప్రభుత్వం రెండున్నర లక్షల ఆర్థిక సాయం అందించి ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. 2014-19 మధ్య చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చే రూ.లక్షన్నరకు తోడు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం చేసి పేదలకు తోడుగా నిలిచిందని తెలిపారు. గూగుల్ రాకతో విశాఖను ప్రపంచపటంపై నిలబెట్టామన్నారు. 2029 నాటికి రెండు కోట్ల మందికి సొంత ఇళ్లను అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆయన తెలిపారు. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. టిడ్కో గృహాల్లో అనేక సమస్యలున్నాయని, ఆ సమస్యలన్నీ పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కొత్తగా పట్టణానికి చెందిన 98 మందికి ఇళ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఆర్డీవో షేక్ ఆయీషా, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, కార్పొరేటర్ కొణతాల నీలిమా, బీఎస్ఎంకే జోగినాయుడు, జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, కూటమి నాయకులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాలు గాడిన పడాల్సిందే..

చక్కదిద్దితేనే ప్రజలకు మెరుగైన సేవలు

- వైసీపీ హయాంలో వ్యవస్థ అస్తవ్యస్తం
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం చర్యలు
- విజన్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం

ఆంధ్రజ్యోతి పరిశీలన



పాయకరావుపేట మండలంలోని పెంటకోట సచివాలయంలో ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్న దృశ్యం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ గాడి తప్పింది. ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు పరిపాలనను చేరువ చేసే లక్ష్యంగా పెట్టుకున్నా అప్పట్లో సచివాలయాల్లో సిబ్బందిపై స్థానిక వైసీపీ నేతల అజమాయిషీ వల్ల వ్యవస్థ క్రమంగా గాడి తప్పింది. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు అనేక చోట్ల సిబ్బంది కొరతతో వెలవెలబోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సచివాలయాలను 'విజన్ సెంటర్లు'గా నామకరణ చేసి, జిల్లాలో ప్రస్తుతం సచివాలయాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టింది. మొన్నటి సాధారణ బదిలీలకు ముందు ఇప్పటికే సచివాలయాల రీ గ్రూపింగ్ జరపడం ద్వారా సచివాలయ పరిధిలో 2,500 మంది జనాభా ఉంటే ఆరుగురు సిబ్బంది, 3,500 మంది జనాభాకు ఏడుగురు, 3,500 దాటి ఉంటే 8 మంది సిబ్బంది ఉండేలా అధికారులు ప్రక్షాళన చర్యలు చేపట్టారు. అయితే వివిధ క్యాడర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో రీగ్రూపింగ్ ద్వారా క్లస్టర్లుగా విభజించినా సిబ్బంది కొరత సమస్య వెంటాడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు, ప్రస్తుతం కార్యాలయాల్లో నెలకొన్న పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' న్యూస్ నెట్‌వర్క్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.



గోవాడ సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

అరకొర సిబ్బందితో అందని సేవలు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉండగా ప్రస్తుత అనకాపల్లి జిల్లా పరిధిలోని 24 మండలాల్లో 522 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయంలోనూ 12 రకాల ఉద్యోగులను నియమించాల్సి ఉంది. ఈ లెక్కన సచివాలయాల్లో 6,264 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా వివిధ కేడర్లకు చెందిన పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. అప్పట్లో మండల కేంద్రాల్లో, రోడ్డు పక్కన ఉన్న సచివాలయాల్లో మాత్రమే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్లు 198 మంది, ఏఎన్ఎంలు 438 మంది, ఎనర్జీ అసిస్టెంట్లు 143, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు 336 మంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు 366 మంది, పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్లు 294 మంది, పంచాయతీ సెక్రటరీ(గ్రేడ్-5)లు 587 మంది, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు 182, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు 47 మంది, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్లు 91 మంది, విలేజ్ సర్వేయర్లు 406 మంది, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 391 మంది, వీఆర్‌ఓలు 352 మంది...మొత్తం 3,831 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇంకా 2,433 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొంతమంది వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయగా, మరికొందరు ఇతరత్రా అవకాశాలు రావడంతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఖాళీలు ఉన్న చోట్ల వైసీపీ ప్రభుత్వం నియామకాలు జరపకుండా జాప్యం చేయడంతో సచివాలయాల్లో సిబ్బంది కొరత సమస్య నెలకొంది. దీంతో అందుబాటులో ఉన్న సిబ్బందే అన్ని పనులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నేటికీ 165 సచివాలయాలు అద్దె భవనాల్లో చాలీచాలని ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లిలోని ఆరో నంబరు సచివాలయంలో పనిచేయని సిస్టమ్, ప్రింటర్

సీపీఐ నేత మాకిరెడ్డి బలవన్మరణం

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):



మాకిరెడ్డి రామునాయుడు (ఫైల్ ఫొటో)

సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు(53) గడ్డి మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. బుధవారం ఆయన భార్య సత్యవేణి పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని బ్యాంక్ కాలనీలో భార్య, పిల్లలతో రామునాయుడు నివాసం ఉంటున్నారు. మూడు నెలల క్రితం కుమారుడు ప్రదీప్ మృతి చెందాడు. కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక రామునాయుడు మనోవేదనతో ఉండేవారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆ సమయంలో కుమార్తె రోషిత ఇంట్లో ఉంది. తండ్రి పరిస్థితి గమనించి హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ రామునాయుడు కన్నుమూశారు. ఆయన స్వగ్రామం గొలుగొండ మండలం చోద్యం. మొదటి భార్య చనిపోయిన తరువాత సత్యవేణిని రెండో వివాహం చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం కొయ్యూరు మండలంలో టీచర్‌గా పని చేస్తున్నారు. రామునాయుడు సీపీఐలో సామాన్య కార్యకర్త స్థాయి నుంచి జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిలర్ సభ్యుడు స్థాయికి ఎదిగారు. పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించేవారు. గతంలో ప్రజానాట్య మండలిలో పని చేశారు. గొలుగొండ మండల అధ్యక్షులుగా రెండు పర్యాయాలు పని చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శిగా ఉన్నారు. ఆయన మరణ వార్త తెలుసుకొని సీపీఐ రాష్ట్ర ... మిగతా 8వ పేజీలో

వాటర్ ట్యాంకు నిర్మాణంలో నాణ్యతా లోపం

కాంట్రాక్టర్‌పై హోం మంత్రి అనిత ఆగ్రహం

- ప్రారంభించకుండానే వెనుతిరిగిన వైనం



పెట్టుగోళ్లపల్లిలో వాటర్ ట్యాంకు నిర్మించిన కాంట్రాక్టర్‌పై మండిపడుతున్న హోం మంత్రి అనిత

ఎస్.రాయవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని పెట్టుగోళ్లపల్లి గ్రామంలో జల్‌జీవన్ పథకం పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకు మెట్ల మార్గం కింద భాగంలో పెచ్చులూడడం, లీకేజీ రావడంపై హోం మంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం ఆ వాటర్ ట్యాంకును ప్రారంభించడానికి వచ్చిన ఆమె నాసిరకం నిర్మాణంపై అసహనం వ్యక్తం చేసి కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు.



వాటర్ ట్యాంకు మెట్ల మార్గం కింద భాగంలో పెచ్చులు ఊడుతున్న దృశ్యం

జల్‌జీవన్ పథకంలో భాగంగా కోట్లాది రూపాయల నిధులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తుంటే, నాసిరకం పనులతో నిర్లక్ష్యంగా వాటర్ ట్యాంకు నిర్మిస్తారా? అని కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాన్ని ప్రారం భించకుండా వెనుతిరగడం ఇదే తొలిసారని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు. ట్యాంకు నిర్మాణం చక్కగా చేపట్టిన తరువాతే ప్రారంభిస్తానన్నారు. వాటర్ ట్యాంకు నిర్మాణ నాణ్యతపై కలెక్టర్‌తో పాటు సంబంధిత మంత్రికి కూడా ఫిర్యాదు చేశానని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు వెంకట ప్రశాంతి, నరసింహమూర్తి దంపతులు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, జనసేన నియోజకవర్గ నాయకుడు గెడ్డం బుజ్జి, మాజీ ఎంపీపీ వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, పీఏసీ చైర్‌పర్సన్‌లు తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, నాయకులు పల్లెల జగ్గారావు, బీమరశెట్టి శ్రీనివాసరావు, కోనా అప్పలరాజు, అల్లు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరిట వల

బాలికల వెంటపడుతున్న జులాయిలు

- మాయమాటలు చెప్పి, కానుకలు ఎరగా వేస్తున్న వైనం
- నర్సీపట్నం టౌన్ పరిధిలో మూడు పోక్సో కేసులు నమోదు
- గొలుగొండ మండలంలో ఒకటి..
- కళాశాలకు వెళుతున్న బాలికను వేధించిన యువకుడు
- అందంగా ఉన్నావంటూ బాలికకు గాలం వేసిన అతిథి అధ్యాపకుడు
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

బాలికలను లక్ష్యంగా చేసుకొని ప్రేమ పేరుతో జులాయిలు వల వేస్తున్నారు. ఏ మాత్రం పరిణితి చెందని మనస్తత్వంతో ఉన్న బాలికలకు మాయమాటలు చెప్పి, చిన్న చిన్న కానుకలు ఎర వేసి తమ వైపు తిప్పుకుంటున్నారు. హైస్కూల్, జూనియర్ కళాశాలకు వెళ్లే వయస్సులో ఆకర్షణలో ఎదురయ్యే అనర్థాలను పెద్దలు చెప్పకపోవడంతో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని పోలీసులు అంటున్నారు. కాలేజీ నుంచి వచ్చిన కుమార్తెతో కాసేపు మాట్లాడే తీరిక, ఓపిక తల్లిదండ్రులకు లేకపోవడం కూడా కారణమని చెబుతున్నారు.

ప్రతీ ఒక్కరి వద్ద స్మార్ట్ ఫోన్ ఉండడం వలన సామాజిక మాధ్యమాల ప్రభావంతో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని ఇబ్బందుల్లో పడుతున్నారు. హాయ్.. హౌఆర్‌యూ మెసేజ్‌లతో ప్రారంభమైన పరిచయం... ఐ లవ్‌యూ చెప్పుకునే వరకు వెళ్లిపోతోంది. దీనికి ఉదాహరణ పదిహేను రోజుల వ్యవధిలో గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్‌లో ఒకటి, నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు పోక్సో కేసులు నమోదు కావడమే. ఇందులో ఇద్దరు బాలికలు గర్భం దాల్చడంతో తల్లిదండ్రులు ... మిగతా 8వ పేజీలో



ఘనంగా అభ్యుదయ సైకిల్ యాత్ర

మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో పోలీసులు చేపట్టిన అభ్యుదయ సైకిల్ యాత్ర బుధవారం పాయకరావుపేటలో ఘనంగా ప్రారంభమైంది. హోం మంత్రి అనిత, రేంజ్ డీజీపీ గోపీనాథ్ జెట్టి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

- వార్త 8వ పేజీలో..

పోలీసుల అభ్యుదయ ర్యాలీలో సైకిల్ తొక్కుతున్న హోం మంత్రి అనిత, రేంజ్ డీజీపీ గోపీనాథ్ జెట్టి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

తల్లి, ఆరు నెలల పసికందు మృతి

- చోడవరంలో ఘోరం

చోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

చోడవరంలోని కనకమహాలక్ష్మినగర్‌లో బుధవారం తల్లి, ఆరు నెలల పసికందు మృతి కలకలం రేపింది. బుచ్చెయ్యపేట మండలం కేపీ అగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.ఉమామహేశ్వరరావు స్థానిక కనకమహాలక్ష్మినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య వీణ (29), ఆరు నెలల బాబు వియాన్ ఉన్నారు. ఆయన కథనం ప్రకారం...బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని ఆరు గంటల ... మిగతా 8వ పేజీలో



ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన వీణ



మృతిచెందిన పసికందు

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: ఎమ్మెల్యే



జనవాణిలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

ఎలమంచిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వస్తున్న ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో నిర్వహించి జనవాణి కార్యక్రమంలో సుమారు 198 వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన వారి నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు తిప్పించుకోకుండా సత్వర సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు కూటమి నేతలు బొద్దపు శ్రీను,గొర్లె నానాజీ, కొఠారు శ్రీను, వూటకూటి రమేష్, లవుడు లోవరాజు, మోటూరు గోపి, చిట్టిబాబులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ర్యాలీ



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న వైసీపీ నేతలు

ఎలమంచిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వ వైద్య దూరంగా చేయొద్దని వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. బొడ్డేడ ప్రసాద్, కరణం ధర్మశ్రీ, బోదెపు గోవింద్ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైసీపీ క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా తహశీల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని తహశీల్దార్ వరహాలరావుకు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ, మండల అధ్యక్షులు బొద్దపు యర్రయ్యదొర, కొల్లి త్రినాద్, మునిసిపల్ వైస్ ఛైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

అచ్యుతాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హరిపాలెం, అందలాపల్లిలలో గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది.. సాయంత్రం గౌరీపరమేశ్వరునుల గ్రామంలో బాజా భజంత్రీలు, చిటికెల భజనలతో ఊరేగింపు జరిపారు. బాణ సంచాను కాల్చారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ మారిశెట్టి ప్రసాద్, కాండ్రేగుల సూర్యనారాయణ, మారిశెట్టి సూర్యనారాయణ, కె. జోగి నాయుడు, కె రామప్రసాద్, కాండ్రేగుల వెంకటరమణ, శరగడం అప్పలనాయుడులతో పాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.



పెదపల్లిలో 4 నెలలుగా ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటరు పోస్టు



4 కి.మీ.దూరంలోని కొక్కిరాపల్లిలో నమోదు చేయించుకుంటున్న విద్యార్థి



మునగపాక మండలం నాగులాపల్లి సచివాలయం-2లో ఖాళీగా ఉన్న ఉద్యోగుల కుర్చీలు

వస్తారు.. వెళ్తారు..

- ఇదీ సచివాలయాల్లో ఉద్యోగుల తీరు
- సమావేశాలు, ఫీల్డు విజిట్‌లతో సతమతం
- సిబ్బంది కొరతనూ..అంతంతమాత్రంగా సేవలు

ఎలమంచిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని సచివాలయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది కొరతతో పూర్తి స్థాయిలో సేవలందడంలేదు. ఉన్న సిబ్బంది ఇళ్ల పన్నుల వసూలు, సమావేశాల పేరుతో వెళ్లిపోతుండడంతో కార్యాలయాలు వెలవెలపోతున్నాయి. వీటికి తోడు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలూ లేకపోలేదు. ఎలమంచిలి మునిసిపాలిటీలో 25 వార్డుల్లోనూ 13 సచివాలయాలు ద్వారా ఉద్యోగులు సేవలందిస్తున్నారు. రెండు రోజుల కిందట మునిసిపాలిటీ పరిధి పెదపల్లిలోని సచివాలయాన్ని 'ఆంధ్రజ్యోతి' సందర్శించగా.. ఉదయం 10 గంటలకుసంక్షేమ కార్యదర్శి, 10.35కి మహిళా పోలీసు కార్యాలయానికి వచ్చారు. శానిటేషన్ కార్యదర్శి ఉదయం 5 గంటలకు వచ్చినట్లు తెలిపారు. అడ్మిన్‌కు ఆరోజు సెలవు. ప్లానింగ్ సెక్రటరీ ఎమ్మెల్యే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నాలుగు నెలలుగా డేటా ప్రోసెసింగ్ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ధృవీకరణ పత్రాల కోసంవచ్చేవారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొక్కిరాపల్లి సచివాలయానికి వెళ్లి అక్కడ కేంద్రంలో నమోదు చేయించుకోవాల్సి వచ్చినట్టు విద్యార్థులు వాపోతున్నారు. అలాగే, కొక్కిరాపల్లి వార్డు సచివాలయాన్ని విజిట్ చేయగా డేటా ఎంట్రీ ఆపరేటరు, మహిళా పోలీసు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అడ్మిన్‌తో పాటు మరో ఉద్యోగి ఇళ్ల పన్నులు వసూలకు వెళ్లినట్లు సిబ్బంది బదులిచ్చారు. మిగిలిన ఇద్దరు సిబ్బంది మునిసిపల్ కార్యాలయంలో సమావేశం పనిమీద వెళ్లినట్టు తెలిపారు. మునిసిపాలిటీలో ఉన్న 13 సచివాలయాల్లో జనాభా ప్రాదిపదికన రీ గ్రూపింగ్ చేసి క్లస్టర్‌గా విభజించి సిబ్బందిని నియమించారు. కానీ, ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉంది. పెదపల్లి, ఏఎస్ఆర్ కాలనీ సచివాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

మునగపాకలో ఖాళీలు..

మునగపాక: మండలంలో నాలుగు సచివాలయాలను 'ఆంధ్రజ్యోతి' రెండురోజుల కిందట సందర్శించింది. మునగపాక సచివాలయం-2 కార్యాలయంలోడిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన విలేజ్ సర్వేయర్, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు విధులకు వెళ్లారు. సేవలు కోసం ఒకరిద్దరు వచ్చి తిరిగి వెళ్లిపోయారు. మునగపాక సచివాలయం-1లో డిజిటల్ అసిస్టెంట్ నియామకం జరగాల్సి ఉంది. ఇక్కడి సిబ్బందీ తహశీల్దార్ కార్యాలయంలో సమావేశానికి వెళ్లిపోయారు. నాగులాపల్లి-1లోసచివాలయం ప్రధాన ద్వారం తలుపులు వేసి తాళం వేసి ఉంది. 12.10 గంటలకు నాగులాపల్లి సచివాలయం-2కు వెళ్లగా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. పంచాయతీ కార్యదర్శి రమణకు ఫోన్ చేయగా.. తహశీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశలో ఉన్నట్లు తెలిపారు. ఇతర సిబ్బంది కూడా ఇక్కడే ఉన్నారని చెప్పారు. మండలంలో అన్ని సచివాలయాల సిబ్బంది బీఎల్‌వోల సమావేశానికి వెళ్లడంతో కుర్చీలు వెలవెలబోయాయి. ఎ క్కువగా సమావేశాలకు వెళ్లారన్న సమాధానాలు వినిపిస్తున్నాయి.ఇందులో వాస్తవం ఏ మేరకో తెలియడం లేదనిప్రజలుఆరోపిస్తున్నారు.ఉన్నతాధికారులు పర్యవేక్షణ తప్పనిసరని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యుమోనియాపై అప్రమత్తం

అచ్యుతాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి కె. శ్రావ్య అన్నారు. ప్రపంచ న్యూమోనియో దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీతో పాటు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లలు న్యూమోనియా బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత శీతాకాలంలో జలుబు, దగ్గు వచ్చినా వెంటనే తమ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో సీహెచ్ఓ జీడీ కృపాచార్యులు, పీహెచ్ఎన్ వరలక్ష్మి, రాజేశ్వరి, సన్యాసిరావు, ఎల్. అప్పలకొండ, కిషోర్‌తో పాటు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల కూటమితోనే సాకారం: ఎమ్మెల్యే సుందరపు



లబ్ధిదారునికి తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

ఎలమంచిలి, నవరంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సొంతింటి కల కూటమి ప్రభుత్వంతోనే సాకారమవుతుందని స్థానిక ఎమ్మెల్యే విజయ్ కుమార్ అన్నారు. మునిసిపాలిటీ ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా మిగిలిన సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా పోత్సహిస్తోందన్నారు. ముందుగా జడ్పీ అతిథిగృహంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, వూటకూటి రమేశ్, కొఠారు శ్రీను, గొర్లె బాబూరావుపాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పాలన



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం: పేదల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆశయాలను ప్రస్తుతం నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. కేవలం 16 నెలల్లో సుమారు మూడు లక్షల గృహాలు పూర్తిచేసి లబ్ధిదారులకు తాళాలందిస్తున్నారన్నారు. 2014-19 కాలంలో చంద్రబాబు 12 లక్షల టిడ్కో గృహాలను పూర్తిచేస్తే.. జగన్ రెడ్డి ఐదేళ్లలో ప్రచార ఆర్భాటం తప్ప ఇళ్లనిర్మాణాలు పూర్తిచేయలేదన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీ రామ్, లాలం శ్రీభరత్ పాల్గొన్నారు.

తగ్గిన కొబ్బరి ధర



మోసయ్యపేట సంతలో కొబ్బరికాయలు

అచ్యుతాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మోసయ్యపేట సంతలో బుధవారం కొబ్బరి ధర తగ్గింది. గాజువాక రోడ్డులోని ఈ సంత ప్రతి శుక్రవారం వారపు సంతతో పాటు ప్రతి సోమ, బుధవారాలు కూరగాయల సంత నిర్వహిస్తారు. కార్తీక మాసంతో పాటు అయ్యప్ప మాలధరించిన వారు మండలంలో అధికంగా ఉండటంతో కొబ్బరికాయలకు బాగా గిరాకీ పెరిగింది. గత సోమవారం కొబ్బరి కాయ రూ. 35 నుంచి 40కి విక్రయించారు. బుధవారం మాత్రం రూ. 30 నుంచి 35 వరకు అమ్మకంచేశారు ఉదయం పది దాటిన తర్వాత దీని ధర రూ. 25కు పడిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి కూడా సంతకు భారీగా కొబ్బరి కాయలు రావటంతో ధర తగ్గందని స్థానిక రైతులు తెలిపారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం



దిమిలిలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓలు విజేత, సుమంత

రాంబిల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏఓ పి.విజేత, మండల ఏవో సి. సుమంత లు సిబ్బంది, రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వరిపైరు పొట్టదశ, పూతదశలో ఉన్నందున మ్యాంకోజెబ్ కార్బన్డిజం రెండు గ్రాములు లేదా కొనజోల్ ఒక ఎంఎల్ లీటరు నీటికి కలిపి పంటకు పిచికారీ చేసినట్లయితే, గింజరంగు మారకుండాను, మానిపండు తెగుళ్లను నిరోధించవచ్చునని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సీఐటీయూ సభలను జయప్రదం చేయాలి

అచ్యుతాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి రొంగలి రాము కోరారు. బుధవారం వివిధ కర్మాగారాల్లో పనిచేసే ముఠా కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయటంలేదన్నారు. సామాజిక భద్రతతో పాటు పరిశ్రమల్లో సౌకర్యాలు కానరావడంలేదన్నారు. కానీ, విద్యుత్, బ్యాంకులు తదితర సంస్థలు ప్రవేటీకరణ విధానాలను అమలు చేస్తోందన్నారు వీటన్నిటినీ నిరసిస్తూ డిసెంబరు 21 ఒకటి నుంచి 2026 జనవరి నాలుగు వరకు విశాఖలో జరిగే అఖిల భారత 18వ కార్మిక మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు సోమునాయుడు, తాతారావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

బయో రిసోర్స్ సెంటర్ ప్రారంభం



బయో రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్లపల్లి గ్రామంలో బయో రిసోర్స్ సెంటర్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులందరికీ గ్రామంలోనే వనరులు అందుబాటులో ఉండేలా ఈ సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ డీపీవో లచ్చన్న, తహశీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో మీనాకుమారి, ఏవో సౌజన్య, ఏపీఎం శివప్రసాద్, ఎంపీపీ వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, సర్పంచ్ అల్లు వెంకట ప్రశాంతి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌లు నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, నాయకులు కోన అప్పలరాజు, పల్లెల జగ్గారావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, కోడ లోవరాజు, అల్లు మోహన్ పాల్గొన్నారు.

కష్టపడే వారికి టీడీపీలోనే గుర్తింపు

- టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్




కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబాబును సత్కరిస్తున్న దృశ్యం

నక్కపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఇచ్చే పార్టీ టీడీపీ మాత్రమేనని నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబును బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్టిబాబు సేవలను మంత్రి అనిత గుర్తించారన్నారు. నిస్వార్థంగా సేవ చేసే వారిని పార్టీ గుర్తిస్తుందని చిట్టిబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.లక్ష్మణరావు, నాయకులు కురందాసు నూకరాజు, డి.సత్యనారాయణ, ఐ.అప్పలరాజు, కె.వీరబాబు, లోవరాజు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు ప్రభుత్వ సహకారం

నక్కపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిన గృహాలను పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తున్నదని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ చెప్పారు. వేంపాడు గ్రామంలో నూతన గృహాలను ప్రారంబించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గింజాల లక్ష్మణరావు, కె.నూకరాజు, డి.సత్యనారాయణ, నూకరత్నం, అప్పలరాజు, కె.బుజ్జి, వి.శ్రీను, షేక్ మున్నీషాబేగం పాల్గొన్నారు.

సచివాలయాల్లో సిబ్బంది కొరత





పెనుగొల్లు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కార్యదర్శులు.. (ఇన్‌సెట్‌లో) సచివాలయం


- 25 సచివాలయాల్లో 175కి 125 మంది ఉద్యోగులు
- 25 మంది డిజిటల్ అసిస్టెంట్లకు ఉన్నది ఆరుగురు
- పలువురు ఉద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు
- సకాలంలో సేవలు అందక ప్రజల అగచాట్లు

పాయకరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలు సిబ్బంది కొరతతో వెలవెలబోతున్నాయి. ప్రధానంగా డిజిటల్ అసిస్టెంట్ల లేమితో ప్రజలకు సేవలు అందడంలో జాప్యం జరుగుతోంది. జనాభా ప్రాతిపదికన పట్టణంలో ఐదు సచివాలయాలు, మండలంలోని 23 పంచాయతీల్లో 20 సచివాలయాలు ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 175 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన బదిలీలతో ప్రస్తుతం 125 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. పంచాయతీలో ప్రజల అవసరాలు, వివిధ సేవలకు అనుగుణంగా ఒక్కో సచివాలయానికి డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎంతో పాటు మహిళా పోలీస్, ఇంజనీరింగ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అసిస్టెంట్లు ఉండాలి. అయితే మండలంలోని 25 సచివాలయాలకు ప్రస్తుతం ఆరుగురు డిజిటల్ అసిస్టెంట్లు మాత్రమే ఉండగా, ఇంజనీరింగ్, రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లను ఆయా శాఖల అధికారులు తరచూ తమ శాఖ పనులకు వినియోగించుకుంటున్నారు. దీంతో పలు సచివాలయాల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేక వెలవెల బోతున్నాయి. పాల్తేరు సచివాలయంలో ఇద్దరు, పెంటకోటలో ముగ్గురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రైతులకు అవసరమైన 1బి తదితర ప్రభుత్వ సేవల్లో జాప్యం జరుగుతున్నాయి. దీనికితోడు పలు సచివాలయాల్లో ప్రింటర్లు మూలకు చేరడంతో వివిధ సర్టిఫికెట్ల కోసం పలుమార్లు తిరగాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సచివాలయాలకు పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించడంతో పాటు సౌకర్యాలు కల్పించి అన్ని రకాల సేవలు సక్రమంగా అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని 24 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 2500 జనాభా గల సచివాలయాలు ఏడు, 3500 జనాభా గల సచివాలయాలు పది, 3500 దాటి జనాభా ఉన్న సచివాలయాలు ఏడు ఉన్నాయి. వీటిలో మొత్తం 168 సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి ఉండగా, 149 మంది మాత్రమే ఉన్నారు. పెనుగొల్లు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ సెక్రటరీతో పాటు విలేజ్ సర్వేయర్ ఉన్నారు. ఈ సచివాలయం క్లస్టర్ కావడంతో ధర్మవరం అగ్రహారం, పెనుగొల్లుకు కలిపి ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్ విధులకు హాజరయ్యారు. ఇక్కడ వీఆర్‌వో కొరత ఉండడంతో మరో ప్రాంతానికి చెందిన వీఆర్‌వోను ఇన్‌చార్జిగా నియమించారు.

నేడు దార్లపూడి మరిడిమాంబ జాతర



ఎస్.రాయవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి గ్రామంలో గురువారం మరిడిమాంబ జాతర జరగనుంది. గ్రామానికి ఇదే పెద్ద పండుగ కావడంతో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యంలో జనాలు తరలి వస్తుంటారు. జాతర రోజున గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని పలు రకాల పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేశారు. పుర వీధులు విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్నాయి.

మెడికల్ కాలేజీలపై వైసీపీ నిరసన ర్యాలీ

పాయకరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు ఆధ్వర్యంలో గౌతమ్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా కంబాల జోగులు, చిక్కాల రామారావు మాట్లాడుతూ వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తే విద్యార్థులు నష్టపోతారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతిత్రం అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు లంక సూరిబాబు, జి.శ్రీనివాసరావు, డి.బాబూరావు, వీసం రామకృష్ణ, పైలా శ్రీనివాస్, డి.సాయిబాబా, డి.బాబి, ఇసరపు తాతారావు, జగతా శ్రీను నాలుగు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న వైసీపీ నాయకులు

ముగిసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

- స్వామిని దర్శించుకున్న మంత్రి అనిత, ప్రజా ప్రతినిధులు





ఊంజల్ సేవలో స్వామివారు... పండితుల ఆశీర్వచనం పొందుతున్న మంత్రి అనిత

ఎస్.రాయవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం స్వామివారి ఊంజల్ సేవతో ముగిశాయి. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మధ్యాహ్నం వేంకటేశ్వరస్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఆలయ మర్యాదులతో వేద పండితులు స్వాగతం పలికారు. ఎంపీపీ వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, ఎలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రమాకుమారి, జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు గెడ్డం బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు తదితరులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అంతకముందు ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో వేద పండితులు అర్చన, హోమాలు, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. తరువాత వైభవంగా స్వామివారి చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌లు తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, నాయకులు నరసింహమూర్తి, కొణతాల శ్రీనివాసరావు, సోమిరెడ్డి రాజు, ఆలయ నిర్వాహకుడు కుర్రా కాశి, పులి సత్తిబాబు, వీసం సాయి పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కోటవురట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు బాలల దినోత్సవం, 15న విద్యార్థులకు మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ పోటీలు, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే 16న చిత్రలేఖనం పోటీలు, 17న మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 20న విజేతలకు అధికారులు, ప్రజాప్రతినిధులతో బహుమతి ప్రదాన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

'నిరుపేద విద్యార్థుల చదువే పరమార్థం'

నక్కపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో తల్లిదండ్రులు లేని పిల్లలు, నిరుపేద విద్యార్థుల చదువే పరమార్థమని బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ సంస్థ ఛైర్మన్ చాంద్ పాషా చెప్పారు. బుధవారం నక్కపల్లి మండలం గొడిచెర్ల జడ్పీ హైస్కూలను సందర్శించి సుమారు 50 మంది విద్యార్థులకు పలు సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువు మధ్యలో నిలిచిపోకూడదనే ఉద్దేశంతోనే 52 పాఠశాలల్లో 2002 నుంచి తమ సంస్థ ఎన్నో సేవలందిస్తోందన్నారు. ఈ పాఠశాలలో 2004 నుంచి 15 మంది విద్యార్థులను దత్తత తీసుకుని, వారికి అవసరమైన మెటీరియల్‌ను అందజేస్తున్నామని ఆయన చెప్పారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన గోల్డెన్ స్టార్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో బిగ్ హెల్ప్ జోనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, హెచ్ఎం సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి పొట్ట దశలో పొటాష్, యూరియా చల్లుకోవాలి

పాయకరావుపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరిలో చిరు పొట్ట దశలో పొటాష్, యూరియాను కలిపి చల్లుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ సూచించారు. మండలంలోని పెంటకోట, మాసాహెబ్‌పేట గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి చిరుపొట్ట దశలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. చిరుపొట్ట దశలో ఉన్న వరిలో ఎకరాకు 20 కిలోల పొటాష్, 25 కిలోల యూరియాను వేసుకుంటే గింజ పూర్తి స్థాయిలో తయారై దిగుబడి పెరుగుతుందన్నారు. పొటాష్ వేసుకోవడం వల్ల మొక్క చీడపీడలను తట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శివకుమార్, సతీశ్, రైతులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తే సత్ఫలితాలు

- సచివాలయాల్లో సమస్యలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- 540 రకాల సేవలు అందుతుండడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వస్తున్న ప్రజలు
- కంప్యూటర్లు, ప్రింటర్లు తదితరాలు పనిచేయక నత్తనడకన సాగుతున్న పనులు


అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్బవరం-4 సచివాలయం


అనకాపల్లి పట్టణంలోని సచివాలయం-4లో ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రీ గ్రూపింగ్ అయ్యాక సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయి. అనకాపల్లి పట్టణంలో 27 సచివాలయాలు ఉండగా, వీటి ద్వారా 540 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్, వన్-బి అడంగళ్, మ్యూటేషన్, డేట్ ఆఫ్ బర్త్, తప్పొప్పులు సరిచేయడం, పన్నుల మార్పు వంటివి ఇక్కడే చేస్తుంటారు. జనాభా ప్రాతిపదికన ఒక్కో సచివాలయంలో ఏడు నుంచి తొమ్మిది మంది వరకు వివిధ విభాగాల సెక్రటరీలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సిబ్బంది ప్రజలకు అందుబాటులోకి వచ్చి సేవలు అందిస్తున్నారు. క్లస్టర్ వారీగా ప్రభుత్వం ఇచ్చిన సర్వేలను వీరే చేస్తున్నారు. కౌసల్యం, పీ-4, వాట్సాప్ గవర్నెన్స్ వంటి సర్వేలను చేస్తున్నారు. సర్వేల వల్ల పనిభారం అధికమవుతుందనే భావన వారిలో కనిపిస్తుంది. రీ గ్రూపింగ్ వల్ల సత్ఫలితాలు కూడా కనిపిస్తున్నాయి. కొన్ని సచివాలయాల్లో ఎమ్యూనిటీ సెక్రటరీల కొరత ఉండడంతో ఉన్న సెక్రటరీలను డిప్యూటేషన్‌పై అధికారులు వేయడం వల్ల వారికి కేటాయించిన సచివాలయంలో పనులు నత్తనడకగా సాగుతున్నాయి. ఇదిలావుంటే, పలు సచివాలయాల్లో అతి ముఖ్యంగా ఉపయోగపడే కంప్యూటర్ సిస్టమ్స్, ప్రింటర్లు వంటివి పనిచేయకపోవడం వల్ల ప్రజలకు సకాలంలో వివిధ రకాల ధ్రువపత్రాలు అందడంలో ఆలస్యమవుతుంది. ఒకే చోట మూడు సచివాలయాలు ఉండగా, రెండు చోట్ల ఈ పరికరాలు పనిచేయక పోవడంతో మూడో చోట ఉన్న సిస్టమ్, ప్రింటర్లను సచివాలయ సిబ్బంది వినియోగించుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతోందని పలువురు సిబ్బంది వాపోతున్నారు.


సొంత భవనంలో కొనసాగుతున్న సబ్బవరం-1 సచివాలయం

సిస్టమ్స్ మెరుగుపరుస్తున్నాం : జడ్సీ

ఈ విషయాలను జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి వద్ద ప్రస్తావించగా, సిస్టమ్స్ మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సిస్టమ్స్ మెరుగుపరిచే పనిలో ఇంజనీర్లు ఉన్నారని, అన్నీ అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు.

కొందరు సిబ్బంది నిర్వాకంపై పలువురు పెదవి విరుపు!

సబ్బవరం : మండలంలో 20 సచివాలయాలున్నాయి. అందులో సబ్బవరం-4 సచివాలయానికి పక్కా భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతోంది. మరోమూడు నారపాడు, బాటజంగాలపాలెం, పైడివాడ అగ్రహారంలలో గల సచివాలయాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. కాగా వంగలి, నారపాడు, బోదివలస సచివాలయాలకు ఇంటర్నెట్ సమస్య అధికంగా ఉందని ఎంపీడీవో తెలిపారు. బంగారమ్మపాలెం సచివాలయానికి కూడా కనెక్టవిటీ సమస్య ఉన్నట్టు చెబుతున్నారు. ఈ ఇరవై సచివాలయాల పరిధిలో 167 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అందులో 90 శాతానికి పైగా స్థానికంగా ఉండడం లేదని ప్రచారంలో ఉంది. మహిళా పోలీసుల పనితీరు బాగాలేదని అధికారులు చెబుతున్నారు. కాగా ఇటీవల మాదిరిగా కాకుండా అన్ని శాఖల సిబ్బందికి పని ఉందని ఎంపీడీవో తెలిపారు. ఇదిలావుంటే, కొందరు సిబ్బంది చేయితడపనిదే పనిచేయడం లేదని, మరికొంత మంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రచారంలో ఉంది.

టీడీపీలో కార్యకర్తలే అధినేతలు

- పార్టీ మండల కమిటీ, అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకారంలో మంత్రి 'కొల్లు'


కమిటీ ప్రతినిధులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర


మంత్రితో మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు

కశింకోట (అనకాపల్లి టౌన్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కార్యకర్తలే అధినేతలని ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కశింకోటలో బుధవారం జరిగిన పార్టీ మండల కమిటీ, అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక వైసీపీ చేస్తున్న అసత్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రజలకు తెలియజేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శతశాతం సీట్లు కూటమి అభ్యర్థులే గెలిచేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడిగా గొంతిన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కాండ్రేగుల సతీష్‌లతో మంత్రి ప్రమాణం చేయించారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, టీడీపీ యువ నాయకుడు డాక్టర్ పీలా శ్రీకాంత్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాజీ మంత్రి 'దాడి'ని కలిసిన రవీంద్ర

అనకాపల్లి టౌన్ : రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావును ఇక్కడ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనలో ఉన్న ఆయన సంతబయలులోని దాడి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా విందు స్వీకరించి కుటుంబ సభ్యులతో కాసేపు సరదాగా గడిపారు.

పీలా వారి గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు


గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న రఘునాథ్

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం వినాయక గౌరీ సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న పీలా వారి గౌరీ పరమేశ్వరుల మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవాధ్యక్షులు కొణతాల రఘునాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్వామివారి కల్యాణ విందును రఘునాథ్, బొడ్డేడ భాగ్యలక్ష్మి ప్రారంభించారు. గవరపాలెంలోని అనేక ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. అలాగే జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి కూడా గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షులు భీమరశెట్టి మహాలక్ష్మీనాయుడు, కార్యదర్శి బుద్ద శివ, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు

లంకెలపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెం మారుతి కూడలిలో గల అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా బుధవారం మహత్ పంచక శాంతి కల్యాణ మహోత్సవం, మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర, ఆలయ కమిటీ ప్రతినిధులు మాదాసు శ్రీనివాసరావు, పచ్చికోరు రమణమూర్తి, మడక రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో 62 పశువులకు గర్భకోశ చికిత్సలు



పాడి రైతులకు సూచనలిస్తున్న జిల్లా పశు సంవర్థక శాఖాధికారి రామ్మోహనరావు

అనకాపల్లి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం తుమ్మపాలలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 62 పశువులకు చికిత్సలు జరపడంతో పాటు 48 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రామ్మోహనరావు మాట్లాడుతూ పశువులకు పునరోత్పత్తి, యాజమాన్య పద్ధతులు, లింగ నిర్ధారణ వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

గవరపాలెంలో పేదలకు దుప్పట్లు పంపిణీ


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కుమార్జీ, సూర్యనారాయణ దంపతులు

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రిటైర్డు అధ్యాపకుడు ఎంఆర్‌జీ కుమార్జీ, సూర్యనారాయణ దంపతులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలి తీవ్రత రోజు రోజుకి పెరుగుతుండడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లోని పేదలకు వీటిని అందజేశారని ఆలయ మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ తెలిపారు. ఆలయ సిబ్బంది, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఉమెన్ పీఎస్ సీఐగా నీలిమా


సీఐ నీలిమా

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కె. నీలిమా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న ఈమెను రెండు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో డీఐజీ గోపినాథ్ జెట్టి అనకాపల్లికి నియమించడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న చంద్రశేఖర్ అచ్యుతాపురం స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

పరవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి బీసీ కాలనీలో పంచాయతీ నిధులు రూ.25 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సర్పంచ్ గొర్లి అమ్ములు బుధవారం శంకుస్థాపన చేశారు. నాయకులు గొర్లి గోపి, రామారావు, శ్రీనివాస్, రొంగలి నాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ అంబలం పూజ


అంబలం పూజలో హారతి వెలుగిస్తున్న భక్తులు

సబ్బవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావలమ్మపాలెంలో బీజేపీ నాయకులు చొక్కాకుల వెంకటరావు, గోవింద కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఆంజనేయస్వామి అంబలం పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి గొర్లి నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు ఆంజనేయ, భవానీ, అయ్యప్ప, శివ మాలలు ధరించిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి చక్కని గీతాలను ఆలపించారు. స్థానిక పెద్దలు ఎస్టీ రామకాసు, నారాయణమూర్తి, పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాసరావు తదితరులతో పాటు చొక్కాకుల వెంకటరావు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తం

లారస్ ల్యాబ్ ఉద్యోగుల అవగాహన సదస్సులో సీఐ


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్ యూనిట్-3లో ఉద్యోగులకు బుధవారం సైబర్ నేరాల నియంత్రణపై ఏర్పాటు చేసిన అవ గాహన సదస్సులో మాట్లాడారు. డిజిటల్ అరెస్టు, తప్పుడు పెట్టుబడి యాప్‌లు, వర్క్ ఫ్రం హోమ్ ఆఫర్స్ ద్వారా జరిగే మోసాలను వివరించారు. సైబర్ నేరగాళ్లు తప్పుడు లింక్‌లు పంపించి బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు ఎలా దోచుకుంటారో వివరిస్తూ అప్రమత్తం చేశారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ విజయకుమారి, లారస్ పరిశ్రమ హెచ్ఆర్ మేనేజర్లు చంద్రశేఖర్, మల్లికార్జునరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, మత్తు పదార్థాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. పరవాడ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఇన్‌చార్జి హెచ్ఎం డేవిడ్ ఆశీర్వాదం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇనుప వంతెనకు రంధ్రాలు.. రాకపోకలకు ఇబ్బందులు


తుప్పుపట్టి దెబ్బతిన్న ఇనుప వంతెన

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యల్లయ్య కాలువపై ఏర్పాటు చేసిన ఇనుప వంతెనకు రంధ్రాలు పడడంతో అటుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని లక్ష్మీదేవిపేట రైల్వే గేటు వద్ద రైళ్ల రాకపోకల సమయంలో గేటు పడితే చోడవరం రోడ్డు మీదుగా పట్టణంలోకి వెళ్లేందుకు వీలుగా కొన్నేళ్ల క్రితం దీనిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది దెబ్బతింది. ఇనుప వంతెన కావడంతో పూర్తిగా జంగు పట్టి మధ్య భాగంలో రంధ్రాలు పడ్డాయి. దీంతో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. తుమ్మపాల, చోడవరం నుంచి అనకాపల్లి పట్టణానికి, రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రజలకు లక్ష్మీదేవిపేట రైల్వేగేటు మార్గమే ప్రధానమైనది. అయితే ఇటీవల కాలంలో రైళ్ల సంఖ్య పెరగడంతో పాటు తరచూ గేటు పడుతుండడంతో వాహనచోదకులు ఎక్కువ సేపు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులను కొన్నేళ్ల క్రితం గుర్తించి యల్లయ్యకాలువ మీద ఇనుప వంతెన ఏర్పాటు చేశారు. మిరియాల కాలనీ ఒకటో వీధిలోంచి విజయరామరాజుపేట మెయిన్ రోడ్డుకు చేరుకునేలా ఏర్పాటు చేయడంతో అందరికీ సౌకర్యవంతంగా ఉండేది. అయితే ఈ ఇనుప వంతెన ప్రస్తుతం తుప్పు పట్టి దెబ్బతినడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దంటూ వైసీపీ ర్యాలీలు



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైసీపీ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రింగురోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. పార్టీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు, కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అయితే ఈ ర్యాలీలో విద్యార్థులు , విద్యార్థుల తల్లిదండ్రులుఎక్కడా కనిపించకపోవడం గమనార్హం.

భరణికం గ్రామంలో...

పరవాడ : మెడికల్ కళాశాలల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన రచ్చబండ - కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. బుధవారం భరణికం గ్రామంలో ఏర్పాటు చేసిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు బంధం నాగేశ్వరరావు, పెదిశెట్టి శేఖర్, గొర్లి గోపి, బొండా సతీష్, కావలి వాసు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం చేయాలన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైసీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో సబ్బవరంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు గండి రవికుమార్, కొటాన రాము, బోకం రామునాయుడు, సురేశ్‌రాజ్, చొప్పా నాగరాజు, కర్రి బాబు, దెడ్డం ప్రసాద్, ఎస్.నారాయణ మూర్తి, ఎస్.ముత్యాలనాయుడు, వడ్డాది అప్పలరాజు, శేషుబాబు, యడ్ల నాయుడు, బండారు శ్రీను, గవర రాజు, ఐడీ బాబు తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలో ర్యాలీగా వెళుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

శ్రీవారి ఆలయ హుండీ ఆదాయం రూ. 4.58 లక్షలు

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేమునిగుమ్మంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. 51 రోజులకు భక్తుల కానుకల రూపంలో రూ.నాలుగు లక్షల 58వేల 256లు ఆలయానికి ఆదాయం లభించిందని ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ గౌరీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు పులకండం గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్యాలయం ఆవరణలో వనభోజనాలు


చెట్టుకింద భోజనం చేస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నిత్యం కార్యాలయంలో విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులు, సిబ్బంది మధ్యాహ్న భోజన సమయంలో ఆటవిడుపుగా అందరూ కలిసి భోజనం చేశారు. కార్తీకమాసం సందర్భంగా కార్యాలయం ఆవరణలోని ఉసిరి చెట్టు కింద జడ్సీ చక్రవర్తితో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సహపంక్తి భోజనాలు చేశారు.

సీపీఐ నేత రామునాయుడు మృతికి సంతాపం

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.రామునాయుడు మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రైతులు, కార్మికవర్గాల కోసం రామునాయుడు అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం

సబ్బవరం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి నియోజకవర్గంలోని సబ్బవరం, పెందుర్తి, పరవాడ మండలాల్లో ఇటీవల నూతనంగా నియామకమైన మండల కమిటీలు, గ్రామ కమిటీలు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం ఇరువాడలోని జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరగనుందని టీడీపీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకకు పార్టీ శ్రేణులంతా తరలి రావాల్సిందిగా ఆయన కోరారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతు పనులు

సబ్బవరం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాలిభీమవరం శివారు జాగారపువానిపాలెం- పల్లవానిపాలెం గ్రామాల మధ్య గ్రావెల్ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అస్తవ్యస్తంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దృష్టికి తీసుకు వెళ్లారు. నిధుల సమస్య కారణంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జనసేన పార్టీ నాయకుడు బలిరెడ్డి అప్పారావు తన సొంత నిధులతో సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డును ఎక్స్‌కవేటర్ సాయంతో మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేయించారు. రోడ్డు బాగుపడడతంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది కొరత.. ఆపై సమన్వయ లోపం

- ఇదీ క్లస్టర్ల విభజన తర్వాత గ్రామ సచివాలయాల్లో పరిస్థితి
- పాడేరులో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లపై పని ఒత్తిడి
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలన

గ్రామ సచివాలయాల్లో క్లస్టర్ విభజన తర్వాత సిబ్బంది కొరత వెంటాడుతోంది. కొన్ని చోట్ల సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. దీనికి తోడు సమావేశాలు, ఫీల్డ్ విజిట్ పేరిట వెళ్లిపోతుండంతో జనాలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

పాడేరురూరల్: పాడేరు జిల్లా కేంద్రంలో ఉన్న మూడు గ్రామ సచివాలయాల్లో పూర్తి స్థాయి సిబ్బంది లేరు. ఉన్న సిబ్బందిని డిప్యుటేషన్ వేశారు. దీంతో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లలే ప్రజలకు పెద్ద దిక్కుగా మారారు. 9 మంది ఉద్యోగుల చొప్పున 3 గ్రామ సచివాలయాల్లో 27 మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంది. ఇందులో ఐదు పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లను తహశీల్దార్, కలెక్టర్, ఐటీడీఏ కార్యాలయాలకు


పాడేరు-3 (సుండ్రుపుట్టు) సచివాలయంలో ఖాళీగా ఉద్యోగుల కుర్చీలు

డిప్యూటేషన్లు వేశారు. వీఆర్వో ప్రతీ రోజూ ఉదయం సచివాలయాలకు హాజరై రిజిస్టర్‌లో సంతకాలు చేసి తహశీల్దార్ కార్యాలయానికి, ఏఎన్ఎం ఫీల్డ్ విజిట్‌లకు వెళ్లిపోతుంటారు.మహిళా పోలీసులు కార్యాలయానికి పరిమితం అవుతున్నారు. పాడేరు-1 సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. పాడేరు-2 (పాతపాడేరు) సచివాలయంలో హార్టికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడి సర్వేయర్ కలెక్టర్ కార్యాలయానికి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై డిప్యూటేషన్‌లపై వెళ్లిపోయారు.పాడేరు-3(సుండ్రుపుట్టు) వచ్చేసరికి ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అగ్రికల్చర్ అసిస్టెంట్ , సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ డిప్యుటేషన్‌పై వెళ్లారు.. దీంతో జనాలకు డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే దిక్కవుతున్నారు. వీరికీ ఇంటింటా సర్వే, ఆధార్ నమోదుతో పని ఒత్తిడి పెరుగుతుంది.

మూడు శాఖల్లో పని భారం

పెదబయలు: స్థానిక మేజర్ పంచాయతీ సీతగుంట పరిధిలో 8 గ్రామాలు, 3800 మంది జనాభా కలదు. సచివాలయం ప్రస్తుతం పంచాయితీ కార్యలయంలోనే కొనసాగుతోంది. ఇక్కడ 8 మంది సచివాలయ ఉద్యోగులు అవసరం. ప్రస్తుతం కార్యదర్శితో సహా ఏడుగురు ఉన్నారు. ప్రధానంగా రిగ్యులర్ వీఆర్వో, వెటర్నరీ అసిస్టెంట్, వ్యవసాయ,ఉద్యానవన సహాయకులు లేక సమస్య నెలకొంటోంది. అలాగే వెల్ఫర్ , డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు పని భారంతో సతమతమవుతున్నారు. ఈ సచివాలయ భవన నిర్మాణం పూర్తి కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

క్లస్టర్ విభజనలో లోపాలు

కొయ్యూరు: గ్రామ సచివాలయాలు ప్రభుత్వ మార్గదర్శల మేరకు క్లస్టరు విభజన జరగకపోవడం... పూర్తిస్థాయిలో సిబ్బంది లేక పనితీరు కుంటుపడింది. మండలంలో 23 గ్రామ సచివాలయాలు, 4 పంచాయతీలను ఒక క్లస్టర్లుగా చేసి 12 సచివాలయాలుగా విభజించారు. గతంలో సచివాలయానికి ఎనిమిది మంది సిబ్బంది ఉండగా. విభజన అనంతరం ఐదుగురు ఉద్యోగులే ఉన్నారు. మంప, రాజేంద్రపాలెం, మర్రివాడతో పాటు మరో మూడు సచివాలయాల్లో కేవలం ఇద్దరు, లేదా ముగ్గురు ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు పనిభారం పెరిగింది.

కుంటుపడిన సేవలు..

చింతపల్లి: స్థానిక మేజర్ పంచాయతీలో క్లస్టర్ విధానం అమలులోకి రావడంతో సచివాలయం సేవలు కుంటుబడ్డాయి. ఇక్కడ మూడు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. క్లస్టర్ విధానం అమలులోకి రాక ఒక్కో సచివాలయంలో 11మంది చొప్పున ఉద్యోగులు ఉండేవారు. ప్రస్తుతం గ్రామ సచివాలయం-1లో ఆరుగురు, గ్రామ సచివాలయం-2,3లతో ఎనిమిది మంది చొప్పున పనిచేస్తున్నారు. ఉద్యోగుల కొరతతో సచివాలయం సేవలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందడంలేదు. ఉన్న ఉద్యోగులపై పినిభారం పెరిగిపోయింది. డిజిటల్ అసిస్టెంట్ మినహా వివిధ ఉద్యోగులను సంబంధితశాఖ అధికారులు ప్రత్యేక విధులు కేటాయించడం సమస్యగా మారింది.

కొంచెం అటు.. ఇటుగా విధులకు..

అరకులోయ: మండలం చినలబుడు సచివాలయం ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. రెండు రోజుల కిందట చినలబుడు గ్రామ సచివాలయంలో 'ఆంధ్రజ్యోతి' పరిశీలన నిర్వహించింది. ఉదయం 10 గంటలకు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్ విధుల్లో ఉండగా.. 10.25 గంటలకు మహిళా పోలీస్, 10.32 గంటలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సచివాలయానికి వచ్చారు. పంచాయతీ కార్యదర్శి 10.40 గంటలకు విధులకు హాజరు కాగా.. 10.45 గంటలకు వెటర్నరీ అసిస్టెంట్ సచివాలయానికి వచ్చారు. రెవెన్యూ శాఖతో సంబంధం ఉన్న ఇద్దరు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్ సచివాలయానికి రాలేదు. ఈ ముగ్గురు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లినట్టు డిజిటల్ అసిస్టెంట్ తెలిపారు. ఏఎన్ఎం 11 గంటల వరకు విధులకు హాజరు కాలేదు. చినలబుడు గ్రామ సచివాలయానికి భవనం లేక పాత గ్రామ పంచాయతీ ఆఫీస్‌లో నిర్వహిస్తున్నారు.

విభజన జరగలేదు


అరకు మండలం చినలబడు గ్రామ సచివాలయ ఉద్యోగులు

ఏజెన్సీలో రీ గ్రూపింగ్, క్లస్టర్ల విభజన జరగలేదు. గత వైసీపీ పాలనలో గ్రామ సచివాలయాల్లో ఎంత మందిని ఐతే సచివాలయ ఉద్యోగులుగా నియమించారో అంతే మంది కొనసాగుతున్నారు. తొమ్మిది నుంచి పది మందికి తక్కువకాకుండా ప్రతి గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు ఉన్నారు.

జి. మాడుగులలో..

జి.మాడుగుల: మండలంలోని సింగర్భ పంచాయతీ సచివాలయం పరిధిలో 18 గ్రామాలు, 2500 మంది జనాభా కలిగి ఉంది. ఇక్కడి సచివాలయంలో ఏడుగురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఇంజనీర్ అసిస్టెంట్ డిప్యుటేషన్ పై వేరే పంచాయతీలో చూస్తున్నారు. దీంతో ఉన్న సిబ్బందిపై పని భారం నెలకొంది.

అరకొర సేవలు...

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో క్లస్టర్ విభజనకు ముందుకు 11మంది ఉద్యోగులు ఉండేవారు. ప్రస్తుతం ఏడుగురు మాత్రమే ఉద్యోగులు ఉన్నారు. డిజిటల్ అసిస్టెంట్ మినహా ఇతర ఉద్యోగులు వివిధశాఖల అధికారుల ఆదేశాలతో ఫీల్డ్ విధులకు వెళుతున్నారు.

14 గ్రామాల్లో 3,800 జనాభాకు.. ఏడుగురే ఉద్యోగులు


అనంతగిరిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కార్యదర్శి, సిబ్బంది

అనంతగిరి: మండల కేంద్రంలోని సచివాలయం పరిధిలోని 14 గ్రామాలు, 3800 మంది జనాభా కలిగి ఉన్నారు. ఏడుగురు మాత్రమే ఉద్యోగులు ఉండడంతో సమస్యల పరిష్కారంలో జాప్యం నెలకొంటుంది. ఆరు నెలల క్రితం ఇంజనీరింగ్, వెటర్నరీ అసిస్టెంట్ ఇద్దరూ బదిలీపై వెళ్లిపోయారు. ఎగువశోభ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు అనంతగిరి అదనపు బాధ్యతలను అప్పగించినా పెద్దగా ఫలితం కానరావడంలేదు. కార్యదర్శికి పంచాయతీకి ఆదాయం పెంచడంతో పాటుగా పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. ఆయనే సచివాలయం యాప్ ద్వారా సేవలను చూసుకోవాల్సి వస్తోంది.

న్యూఢిల్లీ టీబీసీలో 'మాతోట' వ్యవసాయ ఉత్పత్తులు


మాతోట ఎఫ్‌పీవో స్టాల్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న నిర్వాహక ప్రతినిధులు

చింతపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైబల్ బిజినెస్ కాన్‌క్లేవ్ (టీబీసీ)-2025లో మాతోట రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రదర్శించిన ఆదివాసీ ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం న్యూఢిల్లీలో పలు శాఖల ఆధ్వర్యంలో ట్రైబ్ కాన్‌క్లేవ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో మాతోట ఎఫ్‌పీవో ఆదివాసీ రైతులు పండించిన అరకు కాఫీ, మిరియాలు, పసుపు కొనుగోలుకు దేశ, విదేశీ వర్తకులు ముందువచ్చినట్టు మాతోట ఎఫ్‌పీవో వనపల చిన్నారావు తెలిపారు. గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దేవ్‌రామ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొత్త కోర్సులతో ఉపాధి: పీవో


డిగ్రీ కళాశాలలో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభిస్తున్న పీవో శ్రీపూజ, బ్యాంక్ అధికారులు

అరకులోయ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ స్థాయి విద్యార్థులు ప్రస్తుతం మారిన పరిస్థితులకు అనుగుణంగా కొత్తగా వస్తున్న కోర్సులను అభ్యసించాలని ఐటీడీఏ పీవో శ్రీపూజ తెలిపారు. బుధవారం స్థానిక మహిళా డిగ్రీకళాశాలను సందర్శించారు. అలాగే, కళాశాలకు పాడేరు యూనియన్ బ్యాంకు వారు సమకూర్చిన ఆర్వోప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. పిన్సిపాల్ పట్టాసి చలపతి కళాశాలలో ఉన్న సమస్యలను పీవోకు వివరించారరు. యూనియన్‌బ్యాంక్ ఆల్ ఇండియారీజనల్ హెడ్ జితేంద్ర శర్మ,అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థి ఎంపిక


పోటీలకు ఎంపికైన వెంకటవరప్రసాద్


పాడేరురూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థి పాడి వెంకట వర ప్రసాద్‌ను ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కొట్టగుళ్లి రమాదేవి, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది బుధవారం అభినందించారు. ఇటీవల రాష్ట్రస్థాయి ఆర్చరీ అండర్-19 విభాగంలో ప్రసాద్ ప్రతిభను చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

విజ్ఞాన్ మంథాన్ స్థాయి-2 పరీక్షకు విద్యార్థినులు అర్హత


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


గూడెంకొత్తవీధి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రింతాడ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు అఖిల భారత విజ్ఞాన్ మంథాన్ స్థాయి-2 పరీక్షలకు ఎంపికైనట్టు హెచ్ఎం సుమిత్ర తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిభ వంతులైన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించించిందన్నారు. విద్యార్థినులుసాగిన తేజస్విని, బిసుదొర శ్రీవల్లి, వంతల అఖిల ఈ పరీక్షల్లో ఎంపికయ్యారన్నారు. వీరికి స్కాలర్‌షిప్‌లు అందిస్తారన్నారు. డిప్యూటీ వార్డెన్ గంగభవాని ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


లక్ష్మిని సత్కరిస్తున్న అధికారులు

గూడెంకొత్తవీధి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి రైతు నేస్తం అవార్డు పొందిన గిరిజన మహిళ అడపా లక్ష్మిని స్థానిక తపాలాశాఖ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి. దివాకర్ మూర్తి మాట్లాడుతూ జర్రెల గ్రామంలో ఆర్గానిక్ పద్ధతిలో కాఫీ సాగు చేస్తున్న లక్ష్మి ముప్పవరపు ఫౌండేషన్ అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. లక్ష్మి మాట్లాడుతూ గిరిజన రైతులు వచ్చిన ఆదాయంలో కొంత మొత్తం భవిష్యత్తు కోసం పొదుపుచేయాలని కోరారు.

మేఘమాల


అనంతగిరి కొండలపై మేఘాలు

అనంతగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అరకు-విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని మేఘాలు కనువిందు చేశాయి. చుట్టూ పచ్చదనంతో కొండలపై నుంచి మేఘాల కదలికలతో బుధవారం ఆకట్టుకున్నాయి.

న్యుమోనియాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

పాడేరురూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): న్యుమోనియా వ్యాధి పట్ల వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తి నాయక్ సూచించారు. ప్రపంచ న్యూమోనియా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి సీహెచ్.కమల కుమారి, పి.సింహాచలం, జెకైలాశ్, భూలో కమ్మమినుములూరు పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన లేకుంటే చర్యలు

చింతపల్లి: గర్భిణులు కచ్చితంగా ఆస్పత్రిలో ప్రసవం పొందేలా వైద్యులు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డి. కృష్ణమూర్తి నాయక్ ఆదేశించారు. బుధవారం డీఎంహెచ్‌వో తాజంగి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు, మూమెంట్, ఓపీ రిజిస్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఉద్యోగులు కచ్చితంగా సమయ పాలన పాటించాలన్నారు. స్థానిక వైద్యాధికారి కె. సంతోశ్ కుమార్ బాబు, హోమియో వైద్యాధికారి ఉదయ్ సందీప్ పాల్గొన్నారు.

పీపీపీ విధానం వద్దు: వైసీపీ


పాడేరులో నిరసన చేపడుతున్న వైసీపీ నేతలు, కార్యకర్తలు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్

పాడేరు, నవబంరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నిర్వహించే విధానాన్ని రద్దు చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో వైసీపీ శ్రేణులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య సేవలు, వైద్య విద్యను పేదలకు దూరం చేయాలనే ఆలోచనతోనే కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని తెస్తోందన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో కె.అప్పలస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీ డాక్టర్ జి.తనుజారాణి, మాజీ ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కె.భాగ్యలక్ష్మి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో వన భోజనాలు


క్రికెట్ బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

డుంబ్రిగుడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అరకు వీనరిలో బుధవారం ఘనంగా కార్తీక వన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఐటీడీఏ పీఓ తిరుమణి శ్రీపూజ, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి జిల్లాలోని ఉన్నత అధికారులు హాజరయ్యారు. వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. క్రికెట్‌లో కలెక్టర్ బ్యాటింగ్ తో ఆకట్టుకున్నారు. ఐటీడీఏ పీఓ శ్రీపూజ మ్యూజికల్ చైర్ గేమ్‌లో ఆడారు .

వైభవంగా రుద్రాభిషేకం


రుద్రాభిషేకం చేస్తున్న వేదపండితులు

ముంచంగిపుట్టు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని స్థానిక దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి బెంగళూరుకు చెందినఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. సంస్థ ప్రతినిధి, వేదపండితులు నిర్మలానంద స్వామి, అతనిశిష్యులు శివలింగానికి మొదటిగా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రుద్రాభిషేకం చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు పాల్గొన్నారు.


సిమిలిగుడలో ఇంటి ప్రారంభోత్సవంలో దొన్నుదొర


కొయ్యూరు మండలం బుచ్చింతలో ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఎంపీపీలు


డైరీనగర్‌లో గృహ ప్రవేశంలో చింతపల్లి ఎంపీపీ అనుషదేవి, ఏఎంసీ చైర్మన్

'పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం'

అరకులోయ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నిజం చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర అన్నారు. మండలంలో కొత్తభల్లుగుడ పంచాయతీ సిమిలిగుడ గ్రామంలో ఇళ్లను సియ్యారి దొన్నుదొర, ఐటీడీఏ పీవో శ్రీపూజ, మండల ప్రత్యేక అధికారి ,పాడేరు ఆర్డీవో లోకేశ్, సర్పంచ్ కొర్ర రాధిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో పీవీటీజీ లకు చెందిన గిరిజనులకు 2400 పక్కాగృహాలు మంజూరు చేశారన్నారు ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకుఐటీడీఏ పీవో శ్రీపూజ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లవరాజు, తహశీల్దార్, హౌసింగ్ డీఈఈ రాజబాబు, ఏఈఈ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం డౌనూరు పంచాయతీ బచ్చింత గ్రామంలో ఐదుగురి గృహాలను ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు, సర్పంచ్ పొట్టిక భవాని, ఎంపీడీవో ప్రసాదరావులతో కలసి ప్రసాద్ ప్రారంభించారు. హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరావు, వర్క్ ఇన్స్‌పెక్టరు గోవిందు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

జి.మాడుగుల: వంటలమామిడిలో ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసనాయుడు, చిన్నకొండబాబు, సన్యాసినాయుడు, వెంకటరమణ, సన్యాసినాయుడు,పెదబాలన్న, రామ్మూర్తినాయుడు, చిట్టినాయుడు,లక్ష్మీనాయుడు, భరత్, విష్ణు, కొండబాబు, చిరంజీవి పాల్గొన్నారు.

హుకుంపేట: హౌసింగ్ ఏఈ దేవానందం ఆధ్వర్యంలో దూర్గం పంచాయతీ సంపంగిపుట్టు గ్రామంలో గృహ ప్రారంభోత్సవాన్ని స్థానిక నేతలు చేశారు. మండలంలో 588 మందికి గృహ నిర్మాణాలు సాగుతున్నాయని ఏఈ తెలిపారు. హౌసింగ్ సిబ్బంది భాను, చిన్న, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ బెడ్డగుడ గ్రామంలోని బురిడి భాగ్యవతికి చెందిన గృహాన్ని బుధవారం తహసీల్దార్ వీరభద్రచారి, జడ్పీటీసీ గంగరాజు ప్రారంభోత్సవం చేయించారు.ఎంపీటీసీ సన్యాసిరావు, హౌసింగ్ ఏఈ ప్రధాని అశిశ్ భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గృహ లబ్ధిదారులకు ఎంపీడీవో కె.ధర్మారావు ఆధ్వర్యంలో నమూనాలను అందించారు. అనంతరం ఇళ్ల యజమానులు గృహప్రవేశాలు చేశారు. హౌసింగ్ ఏఈ చిట్టపులి కృష్ణారావు మాట్లాడుతూ మండలంలో 23 పంచాయతీల్లో 469 పీఎం జన్‌మన్ గృహాల్లో లబ్ధిదారులు గృహప్రవేశాలు జరిపినట్టు చెప్పారు.సర్పంచ్‌లు ఎస్.సుభాష్‌చంద్ర, వి.లక్ష్మణ్, నేతలు కె.సన్యాసమ్మ, జి.రామ్మూర్తి, కె.బలరాం, ఎస్.బాబూజీ, ఎం.చిన్నిబాబు, బి.రామారావు, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి మండలంలోని డైరీనగర్‌లో గిరిజనుడు గుంట సొనాయి నిర్మించిన పక్కా గృహాన్ని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళతో కలిసి ప్రారంభించారు. ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, సర్పంచ్ దురియా పుష్పలత, తదితరులున్నారు.

డుంబ్రిగుడ,: కొర్రా పంచాయతీ పెదపాడులో గృహ ప్రవేశాలనుచేపట్టారు. మండల ప్రత్యేక అధికారి ఎస్‌బి నంద్, రాష్ట్ర కనీస వేతనాల మండలి డైరెక్టర్ సుబ్బారావు, ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేశారు.నాయకులు ఆనంద్, దనేశ్వరరరావు, పీఏసీఎస్ డైరెక్టర్ సుబ్బారావు. సర్పంచి అర్జున్ పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి: కలెక్టర్

పాడేరురూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు రక్తదానానికి ముందుకు రావాలని కలెక్టర్ దినేశ్ కుమార్ కోరారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం సందర్భంగా ఉద్యోగులు బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి నాయక్, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ జితేంద్ర శర్మ, లీడ్ బ్యాంక్ మేనేజర్ మా తు నాయుడు, మేనేజర్ భానుచందర్ నారాయణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో వైభవంగా అయ్యప్పస్వామి అంబలం పూజ

సీలేరు, నవంబరు 12 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో అయ్యప్ప స్వామి అంబలం పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక శివాలయం వీధిలోని అయ్యప్ప మాలను ధరించిన దండుపాటి కూర్మారావు దంపతులు నివాసంలో మంగళవారం రాత్రి ఈ అంబలం పూజ నిర్వహించారు. అయ్యప్ప ఆలయ పూజారి గురుస్వామి దామోదర స్వామి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమంను నిర్వహించారు.

16న ఒడిశా సీఎంతో బిర్సా ముండా విగ్రహావిష్కరణ

పాడేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో చింతలవీధి కూడలి వద్ద ఆదివాసీ యోధుడు భగవాన్ విగ్రహ ప్రతిష్ఠకు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈనెల 16న ఇక్కడ బిర్సా ముండా విగ్రహాన్ని ఆవిష్కరణకు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ విచ్చేస్తున్నారని బీజేపీ నేతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, పార్టీ నేతలు పి.రవికుమార్, కె.వెంకటరమణ, పి.మత్స్యకొండబాబు, ఎం.గోపాలపాత్రుడు, టి.సత్యవతి, బి.కెజియారాణి, ఎ.ఆనంద్, జయంతి ఉత్సవాల సమితి ప్రతినిధులు ఎం.సూర్యనారాయణ, అబ్బాయిదొర, కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ: బిర్సాముండా స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల సాధనకు పోరాడాలనిఆదివాసి గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. బుధవారం దండకారణ్య కళాశాలలో బిర్సాముండా 150 జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పాట్టంగా రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు బురిడి దరడ్, పెసాకమిటీ కార్యదర్శి కిల్లో రామన్న, అధ్యాపకులు ప్రసాద్,దామోదర్, కృప,రాజేంద్ర, హీరాలాల్, తదితరులు పాల్గొన్నారు.


పాడేరులో భూమి పూజ చేస్తున్న బీజేపీ నేతలు

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

- పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు
- వివిధ కమిటీల ఇన్‌చార్జుల ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు, పక్కన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వివిధ కమిటీల ప్రతినిధుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ నేతలు, క్యాడర్ నిత్యం ప్రజల్లో ఉంటే వారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటిపై పార్టీ జెండా ఎగిరేలా కృషి చేయాలన్నారు.

స్థానిక ఎన్నికల్లో సంపూర్ణ విజయం సాధించాలి: గిడ్డి ఈశ్వరి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు సంపూర్ణ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలనిగిడ్డి ఈశ్వరి కోరారు. నియోజకవర్గంలోని బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఉన్న నేతలు, కార్యకర్తలంతా గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అత్యధిక స్థానాలను సాధించుకున్నప్పుడే రాష్ట్రం నుంచి నిధులు ఎక్కువగా రాబెట్టుకొని గిరిజన గ్రామాలను అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. క్లస్టర్, యూనిట్, విలేజ్, బూత్ కమిటీల ప్రతినిధులతో బుద్ద నాగజగదీశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి సోమెలి చిట్టిబాబు, పాడేరు పీఏసీఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, నాయకులు రొబ్బి రాము, బుద్ద జ్యోతికిరణ్, ఎంపీపీ రత్నకుమారి, మాజీ ఎంపీపీలు బొర్రా విజయరాణి, ఎస్‌వీవీ.రమణమూర్తి, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందినపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, విలేజ్, బూత్ ఇన్‌చార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను పీడిస్తున్న సమస్యలు

గ్రామ/వార్డు సచివాలయాలను సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. అధికారులు చేపట్టి సర్దుబాటు ప్రక్రియలో లోపంతో చాలా సచివాలయాల్లో కార్యదర్శుల కొరత ఉండడం.. యూపీఎస్‌లు మరమ్మతులు కావడం.. ప్రింటర్లు పనిచేయకపోవడం.. మౌలిక వసతులు కొరవడడం.. వెరసి ప్రభుత్వ సేవలకు ఆటంకం ఏర్పడుతోంది. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- సొంత భవనాలు కరవు.. అద్దె భవనాల్లోనే నిర్వహణ
- యూపీఎస్‌ల మరమ్మతులు.. పనిచేయని ప్రింటర్లు
- చాలా సచివాలయాల్లో కార్యదర్శుల కొరత
- సర్దుబాటు ప్రక్రియ లోపం.. ఉద్యోగులపై భారం
- ప్రభుత్వ సేవలకు ఆటంకం.. ఇబ్బందులు పడుతున్న జనం



నర్సీపట్నంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న సచివాలయం... మరమ్మతుకు గురైన యూపీఎస్‌లు

నర్సీపట్నం, నవబంరు 12 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మునిసిపాలిటీలోని 28 వార్డుల్లో 17 సచివాయాలు ఉన్నాయి. మొత్తం మీద 170 మంది అవసరం కాగా, 150 మంది మాౖత్రమే పనిచేస్తున్నారు. ఇక్కడ రెవెన్యూ, మునిసిపాలిటీ సేవలు అందుతున్నాయి. సచివాలయ కార్యదర్శులు పాఠశాలలో బాత్‌రూమ్స్‌ ఫొటోలు తీసి అప్‌లోడ్‌ చేయడం, ప్రత్యేక రోజుల్లో ఆధార్‌ సేవలు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఎన్‌-బీ, అడంగల్‌ సర్టిఫికెట్లు, ఉపకార వేతనాల దరఖాస్తులు పరిశీలన, వార్డులో పారిశుధ్య విధుల పర్యవేక్షణ, ఆస్తి పన్నుల వసూళ్లు, కొత్తగా ఆస్తి పన్నులను గుర్తించి నమోదు చేయడం వంటి విధులు నిర్వర్తిస్తున్నారు. మునిసిపాలిటీలోని సచివాలయాలకు సొంత భవనాలు లేవు. పాత మునిసిపల్‌ కార్యాలయంలో రెండు సచివాయాలు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్‌ మినీ స్టేడియంలో క్రీడా భవనంలో ఒకటి, మెప్మా ఆఫీసులో ఒకటి, బలిఘట్టం డీఎల్‌పీవో కార్యాలయంలో ఆవరణలో ఒకటి సచివాయాలు నడుపుతున్నారు. మిగిలినవి ప్రైవేటు అద్దె భవనానాల్లో నడుస్తున్నాయి. కొన్ని అద్దె భవనాల్లో జాగా సరిపోక, సౌకర్యాలు లేక కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే సచివాలయాల్లో సిబ్బంది కొరత ఉంది. ఇటీవల ఐదుగురు సచివాలయ ఉద్యోగులు డీఎస్సీకి ఎంపిక కావడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. విజన్‌-2047 కార్యాలయానికి కొంత మందిని డిప్యుటేషన్‌పై పంపించారు. పాత మునిసిపాలిటీ భవనంలో ఉన్న అయ్యన్నపాలెం సచివాలయం నుండి ప్లానింగ్‌, ఇమినిటీస్‌ సెక్రటరీ డిప్యుటేషన్‌ మీద వెళ్లారు. అలాగే గచ్చపువీధి సచివాలయం నుంచి ప్లానింగ్‌ సెక్రటరీ, ఎన్టీఆర్‌ మినీ స్టేడియంలోని సచివాలయం శానిటరీ సెక్రటరీ డీఎస్సీకి ఎంపిక కావడంవతో పోస్టు ఖాళీ ఉంది. 6, 7 వార్డులకు సంబంధించిన సచివాలయంలో ఎనర్జీ సెక్రటరీ పోస్టు ఖాళీ ఉంది. సచివాలయాలలో ఇన్వర్టర్లు పనిచేయడం లేదు. యూపీఎస్‌లు మరమ్మతులకు గురవ్వడంతో మూలకు చేరాయి. విద్యుత్‌ సరఫరా నిలిచిపోతే ప్రభుత్వ సేవలకు అంతరాయం ఏర్పడుతున్నది. ప్రింటర్లు కూడా మరమ్మతులకు గురయ్యాయి. ఇంటర్నెట్‌ సమస్య ఉంది. దీంతో సచివాలయ ఉద్యోగులు తమ సెల్‌ ఫోన్లలో ఇంటర్నెట్‌ కనెక్ట్‌ చేసుకొని సేవలు అందిస్తున్నారు.

మేజర్‌ పంచాయతీల్లోనూ సిబ్బంది కొరత

చోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపట్టిన సచివాలయాల ప్రక్షాళనలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేకపోవడంతో అవసరమైన సిబ్బంది కొరత ఏర్పడింది. మండలంలోని 32 పంచాయతీలకు 26 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో వీఆర్వోలు, సర్వేయర్లు మినహాయించి 260 మంది వరకు ఉద్యోగులు ఉండాలి.


సిబ్బంది కొరత ఉన్న నాతవరం సచివాలయం-2 ఇదే..

ప్రస్తుతం 170 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో కూడా కొందరు వేర్వేరు ప్రదేశాల్లో డిప్యుటేషన్ల మీద కొనసాగుతున్నారు. అలాగే చాలా సచివాలయాల్లో ఇన్‌చార్జి కార్యదర్శులే ఎక్కువ ఉన్నారు. కీలకమైన అగ్రికల్చర్‌ అసిస్టెంట్లు ప్రతీ సచివాలయానికి ఒకరు అవసరం కాగా, సర్దుబాటు ప్రక్రియలో 13 మంది మాత్రమే మిగిలారు. వాస్తవానికి వ్యవసాయ శాఖలో సిబ్బంది అవసరం ఎక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం 232 పంచాయతీలకు 13 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇక సచివాలయాల్లో ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లు సర్దుబాటు కూడా సక్రమంగా నిర్వహించకపోవడంతో, మేజర్‌ పంచాయతీల్లో సైతం కొరత వెంటాడుతోంది.

చోడవరం తరువాత మేజర్‌ పంచాయతీ గోవాడలో ఇన్‌చార్జి కార్యదర్శి ఉన్నారు. జుత్తాడ సచివాలయ సెక్రెటరీకి ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యత అప్పగించారు. ఈ సచివాలయంలో డిజిటల్‌, వెల్ఫేర్‌, వెటర్నరీ అసిస్టెంట్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఏఎన్‌ఎం కూడా ఇన్‌చార్జిగానే వ్యవహరిస్తున్నారు. ఇంత పెద్ద సచివాలయానికి ఇంజనీరింగ్‌, అగ్రికల్చర్‌ అసిస్టెంట్లు లేకపోవడం విశేషం. అలాగే మహిళా పోలీసు విశాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. ఫలితంగా ప్రజలకు అవసరమైన సేవలు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. రీ గ్రూపింగ్‌లో అవసరమైన పోస్టులు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాతవరంలో...

నాతవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో 17 సచివాలయాల్లో కొందరు సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదు. మండలంలోని 17 సచివాలయాల్లో మొత్తం 127 పోస్టులు అవసరం కాగా, ప్రస్తుతం 86 మంది పనిచేస్తున్నారు. 41 పోస్టులు భర్తీకాకపోవడంతో సిబ్బంది కొరత ఉంది. నాతవరం-1 సచివాలయంలో కొందరు సమయానికి హాజరుకావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికితోడు ఈ సచివాలయంలో కంప్యూటర్లు మొరాయిస్తుండడంతో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది అలాగే పలు సచివాలయాల్లో సిబ్బంది కొరతతో సకాలంలో సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

రావికతంలోనూ సేవల్లో అలసత్వం


టి.అర్జాపురం సచివాలయంలో ఇద్దరు కార్యదర్శులు పనిచేస్తున్న దృశ్యం

రావికమతం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 149 మంది సిబ్బంది అవసరం కాగా, ప్రస్తుతం 140 మంది ఉన్నారు. తొమ్మిది మంది కార్యదర్శుల కొరత ఉంది. కొన్ని చోట్ల డిజిటల్‌, వెల్ఫేర్‌ అసిస్టెంట్‌లు లేరు. దీంతో సంక్షేమ పథకాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేయడంలో జాప్యం జరుగుతున్నది. గతంతో పోల్చితే సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు సకాలంలో అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఎంపీడీవో మహేశ్‌ను వివరణ కోరగా సిబ్బంది కొరత పెద్దగా లేదన్నారు. సిబ్బంది తక్కువ ఉన్న రెండు, మూడు సచివాలయాలకు పక్క సచివాలయ సిబ్బందిని పంపి పనులు పూర్తి చేయిస్తున్నామన్నారు.


రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడుదల చేస్తున్న స్పీకర్‌, కలెక్టర్‌

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

▸▸ స్పీకర్‌ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నాతవరం నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని స్పీకర్‌ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. జిల్లా కలెక్టర్‌ విజయకృష్ణన్‌తో కలిసి తాండవ రిజర్వాయర్‌లోకి పది లక్షల చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధికి కడియం నుంచి చేప పిల్లలను తీసుకువచ్చి తాండవలో వేసినట్టు చెప్పారు. తాండవలో చేపలు పడుతూ నాతవరం మండలానికి చెందిన జాలారిపేట మత్స్యకారులతో పాటు గొలుగొండ మండలానికి చెందిన జోగంపేట, సాలిక మల్లవరం, పప్పుశెట్టిపాలెం, చోద్యం, అమ్మంపేట, అల్లూరి జిల్లాకు చెందిన ఆడాకుల, రామ్‌నగర్‌ కలిపి 14 గ్రామాల మత్స్యకారులు జీవిస్తున్నారని తెలిపారు. అలాగే నాతవరం-తాండవ రోడ్డుకు రూ.6.36 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. తాండవ స్పిల్‌వేగేట్ల నుంచి తాండవ డామ్‌ వరకు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానని స్పీకర్‌ అయ్యన్నపాత్రుడు మామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జాయింట్‌ డైరక్టర్‌ పి.లక్ష్మణరావు, సహాయ తనిఖీల అధికారి నాగమణి, డీఈఈ అనురాధ, ఆర్డీవో వీవీ.రమణ, ఎంపీడీవో సత్యశ్రీనివాసు, తహశీల్దార్‌ మహేశ్‌, సీఐ రేవతమ్మ, తాండవ చైర్మన్‌ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌.వెంకటరమణ, నాయకులు ఎ.మాణిక్యం, ఎస్‌.సన్యాసిదేముడు, ఎ.నానిబాబు, జోగిబాబు, పి.కొండబాబు, పి.దాసు, ఆర్‌వీఎస్‌ చంద్ర, ఎం.ప్రసాద్‌, అప్పన దివాణం, సీతారామ్మూర్తి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రావణాపల్లి ఆనకట్ట మరమ్మతుకు అంచనాలు

ఇరిగేషన్‌ ఎస్‌ఈ అప్పలనాయుడు.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్‌


రావాణాపల్లి గట్టు పరిశీలిస్తున్న ఎస్‌ఈ అప్పలనాయుడు

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రావణాపల్లి ఆనకట్ట మరమ్మతుల కోసం అంచనాలు తయారు చేసి అత్యవసరంగా నివేదిక ఇవ్వాలని జల వనరుల శాఖ ఉమ్మడి విశాఖ జిల్లా సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌ పి.అప్పలనాయుడు ఆదేశాలు జారీ చేశారు. 'రావణాపల్లి ఆనకట్టకు ముప్పు' అనే శీర్షికతో ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి బుధవారం ఆయన స్పందించారు. ఈ మేరకు ఈఈ బాల శూర్యం, ఏఈ రామన్నపాత్రుడు, నీటి సంఘం చైర్మన్‌ రాజేశ్వరరావుతో కలిసి రిజర్వాయర్‌ను పరిశీలించారు. రిజర్వాయర్‌ నీరు లీకేజీలు అరికట్టడం, పొర్లు కట్టు రాయి పేర్పు, ఆనకట్ట గట్టు అత్యవసరంగా పటిష్టం చేయాలని గుర్తించారు. రావాణాపల్లి మదుం పునర్మిణానికి చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన అంచనాలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు.

తెలుగు రైతు అధ్యక్షుడిగా పాతాళ రమణ


తెలుగు రైతు అధ్యక్షుడు రమణను సన్మానిస్తున్న ఎమెల్యే రాజు

బుచ్చెయ్యపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు రైతు మండల అధ్యక్షుడిగా పాతాళ రమణ నియామకమయ్యారు. ఈ సందర్భంగా రమణను ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్‌.రాజు సన్మానించారు. అలాగే తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలుగా బుచ్చెయ్యపేట సర్పంచ్‌ సుంకర లక్ష్మిని నియమించినట్టు ఎమెల్యే రాజు తెలిపారు. తమకు ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా రమణ, లక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్‌ గేదెల సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ మండల అధ్యక్షుడికి నేతల అభినందన


పార్టీ మండల అధ్యక్షుడు మత్స్యరాజును అభినందిస్తున్న నాయకులు

చోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన కనిశెట్టి మత్స్యరాజును మండలానికి చెందిన పార్టీ నేతలు బుధవారం అభినందించారు. మత్స్యరాజు మంగళవారం ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా లక్కవరం ప్రాంతానికి చెందిన నాయకులు ఆయన్ను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ఈ కార్యక్రమంలో సేనాపతి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌ కర్రి కోటేశ్వరరావు, గాజుల రాజు, నారాయణమూర్తిరాజు, సిహెచ్‌.జగన్నాథం, బి.నాగన్న, మిడతాడ మణికంఠ పాల్గొన్నారు.

'మన డబ్బులు-మన లెక్కలు'పై అవగాహన


మానవహారం చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

దేవరాపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మన డబ్బులు-మన లెక్కలు యాప్‌లపై బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో పొదుపు సంఘాల మహిళలు మానవహారం నిర్వహించారు. అనంతరం ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి మాట్లాడుతూ యాప్‌లపై మహిళలకు అవగాహన అవసరమన్నారు. అలాగే యాప్‌ డౌన్‌లోడ్‌ చేయించి అవగాహన కలిగించారు. ఆర్థిక లావాదేవీలు యాప్‌లో తెలుసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరిపాలనా అధికారి లక్ష్మీనారాయణ, వెలుగు ఏపీఎం ప్రభాకర్‌, ఏపీవో రుక్మిణి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం కృషి

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల రూరల్‌, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదింటి ప్రజల సొంతింటి కల సాకారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని పోతనపూడి అగ్రహారం గ్రామంలో కొత్తగా నిర్మించిన మూడు ఇళ్లకు బుధవారం రిబ్బన్‌ కట్‌ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పేదింటి ప్రజలకు పక్కా ఇళ్లు మంజూరు చేసి, సొంతింటి కలకు సాకారం చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల ఇళ్లకు సహకారం అందించారని చెప్పారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.70 వేలు, పీవీటీజీలకు రూ.లక్ష అదనపు ఆర్థిక సాయం అందించిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ పుప్పాల అప్పలరాజు, కూటమి నాయకులు నందారపు సన్యాశిరావు, రమేశ్‌, దేముడు, సాంబమూర్తి, కుమార్‌, రమణ, వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


పోతనపూడి అగ్రహారంలో కొత్త ఇంటి రిబ్బన్‌ కట్‌ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

30 మందికి సీఎం సహాయనిధి చెక్కుల అందజేత


సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న ప్రజలు చికిత్సలు చేయించుకునేందుకు సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక పంచాయతీరాజ్‌ అతిథి గృహంలో కార్యకర్తలు, నాయకులతో బుధవారం సమావేశమై పార్టీకి సంబంధించిన విషయాలు, నూతన కమిటీల ఏర్పాటు చర్చించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడే వారు వైద్యం చేయించుకునేందుకు ఈ చెక్కులు అందిస్తున్నట్టు చెప్పారు. నాలుగు మండలాలకు చెందిన 30 మందికి రూ.16.25 లక్షలు మంజూరయ్యాయన్నారు. మాడుగుల మండలంలో 13 మందికి 6.4 లక్షలు, చీడికాడ ముగ్గురికి లక్ష, దేవరాపల్లి ఏడుగురికి రూ.5.66 లక్షలు, కెకోటపాడు మండలంలో ఏడుగురికి రూ.3.17 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ పి.అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌.సన్యాసిరావు, కార్యదర్శి పుప్పాల రమేశ్‌, పట్టణ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ, కార్యదర్శి గోపాల్‌వర్మ, కింతలి పీఏసీఎస్‌ అధ్యక్షుడు ఉండూరు దేముడును ఎన్నుకున్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక బుధవారం గ్రంథాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు, క్విజ్‌లు, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. ఈ వారోత్సవాలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాఖా గ్రంథాలయాధికారిణి ఎంఎస్‌ఎల్‌.జోగేశ్వరి, తుమ్మపాల గ్రంథాలయాధికారిణి పద్మావతి, రిటైర్డ్‌ లైబ్రేరియన్‌ ఒ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లల గుర్తింపునకు సర్వే

దేవరాపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖ కమిషన్‌ ఆదేశాల మేరకు దీర్ఘకాలం పాఠశాలకు హాజరుకాని పిల్లలను తిరిగి రప్పించే కార్యక్రమంలో భాగంగా బుధవారం సర్వే చేపట్టారు. మండలంలోని వాలాబు గ్రామంలో లావణ్య అనే విద్యార్థిని కస్తూర్బాగాంధీ పాఠశాలకు గత ఏడాది నుంచి రావడం లేదని తెలుసుకొని సీఆర్పీ పూడి వెంకటరావు గ్రామానికి వెళ్లారు. ఆమె తల్లితండ్రులకుఅవగాహన కలిగించి పాఠశాలకు మరలా వచ్చేలా అంగీకార పత్రం తీసుకున్నారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను తల్లిదండ్రులకు ఆయన వివరించారు.

ఉద్యోగులకు కార్తీక వన సమారాధన

మాడుగుల రూరల్‌, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎం.కృష్ణాపురం అమరలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉద్యోగులు వన సమారాధన కార్యక్రమం చేపట్టారు. తహశీల్దార్‌ రమాదేవి, ఎంపీడీవో అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ మాట్లాడుతూ ఉద్యోగులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఎంపీపీ రాజారామ్‌ మాట్లాడుతూ ప్రజలకు చేస్తున్న సేవలతో ఉద్యోగులకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ వి.చారుమతిదేవి, మండల పరిషత్‌ కార్యాలయం ఏవో గోపాలరావు, సీనియర్‌ అసిస్టెంట్‌ సురేశ్‌కుమార్‌ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు ప్రభుత్వ సహకారం

నక్కపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిన గృహాలను పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తున్నదని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్‌ కొప్పిశెట్టి వెంకటేశ్‌ చెప్పారు. వేంపాడు గ్రామంలో నూతన గృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జి.లక్ష్మణరావు, కె.నూకరాజు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మెడికల్‌ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ర్యాలీలు


చోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్‌, వైసీపీ నాయకులు

చోడవరం/నర్సీపట్నం/మాడుగుల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్‌ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు బుధవారం నిరసన ర్యాలీలు చేపట్టారు. చోడవరం, మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గ కేంద్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. చోడవరంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్‌ కాలేజీలను ప్రైవేటీకరించి పేదలకు డాక్టర్‌ విద్య అందని ద్రాక్షగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేవరకూ పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీపీ గాడి కాసు, నాయకులు ఏడువాక సత్యారావు, పి.వెంకటేశ్‌, డి.సత్య పాల్గొన్నారు.


నర్సీపట్నంలో ర్యాలీ చేస్తున్న నాయకులు

నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్‌ మాట్లాడుతూ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం పేదలు, మధ్య తరగతి ప్రజలకు వైద్య విద్యను దూరం చేస్తుందన్నారు. మాకవరపాలెంలో వైద్య కళాశాల నిర్మాణం జరిగితే 650 పడకల ఆస్పత్రి అందుబాటులోకి వచ్చేదన్నారు. తర్వాత ఉచిత వైద్య పరీక్షలు, ఆధునిక వైద్య సేవలు ప్రజలకు చేరువయ్యేవన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడు, మునిసిపల్‌ చైర్‌పర్సన్‌ సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.


మాడుగులలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి

మాడుగులలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పేద విద్యార్థులకు అన్యాయం చేసే విధంగా మెడికల్‌ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని పేద విద్యార్థుల కలను నిజం చేసే నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈర్లె అనురాధ, కిముదు రమణమ్మ, టి.రాజారాం, కె.శ్రీను, రామధర్మజ, బి.శ్రీను, కళావతి, జె.వరహాలరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌ కళాశాలలో అభివృద్ధి పనులు

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌ కళాశాలలో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రిన్సిపాల్‌ కె.తాతాజీ కళాశాలలో సమస్యలను స్పీకర్‌ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు స్పీకర్‌ స్పందించి కలెక్టర్‌ విజయకృష్ణన్‌ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించారు. అంతే కాకుండా కళాశాల ప్రాంగణంలో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించడానికి రోటావేటర్‌ పంపించి శుభ్రం చేయించారు. కళాశాలలో 80 కొత్త ఫ్యాన్లు, 120 ట్యూబ్‌ లైట్లు అమర్చారు. శ్లాబ్‌ లీకేజీలు, తాగునీటి సరఫరా పైపులు మరమ్మతులు చేయించారు.

మునిసిపాలిటీలో వీధి లైట్‌ చోరీ

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డు రామారావుపేటలో పాత గ్రామీణ బ్యాంక్‌ సమీపంలోని గుర్తు తెలియని వ్యక్తులు వీధి లైట్‌ చోరీ చేశారు. ఈ మేరకు రామారావుపేటకు చెందిన టి.మార్కు మునిసిల్‌ అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం విద్యుత్‌ సరఫరా ఆపేసి, తమ ఇంటి ముందు వీధి లైట్‌ ఇద్దరు వ్యక్తులు విప్పుకొని పట్టుకుపోయారని తెలిపారు.

లీగల్‌ వలంటీర్లకు గుర్తింపు కార్డులు

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోర్టు సముదాయంలో న్యాయమూర్తి పి.షియాజ్‌ఖాన్‌ పారా లీగల్‌ వలంటీర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ నెల 7న ఎంపికైన ఆరుగురు పారా లీగల్‌ వలంటీర్లకు మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బుధవారం శిక్షణ ముగియడంతో, వారికి గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

కేజీబీవీకి బెంచీల వితరణ

నాతవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం కస్తూర్బాగాంధీ విద్యాలయానికి స్పీకర్‌ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ఫ్యాన్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాత వెలగా వెంకట కృష్ణారావు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కె.భవానీ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

నర్సీపట్నం అర్బన్‌, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురంలో ఉపాధి పనులపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఏపీవో సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో 2026-27 సంవత్సరానికి సంబంధించి చేపట్టిన పనులపై చర్చించారు. ముందుగా సోషల్‌, రీసోర్స్‌, సీజనల్‌ మ్యాప్‌లను సచివాలయం వద్ద భూమిపై వేయించి ప్రజలకు వివరించారు. అనంతరం పనుల గుర్తింపునకు సంబంధించి లేబర్‌ బడ్జెట్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ శెట్టి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎం.పాలెంలో వంద పాటల భజన

దేవరాపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో బుధవారం వంద పాటల భజన కార్యక్రమం జరిగింది. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, జోన్‌ ఇన్‌చార్జ్‌ గురన్నచారి, గందం సూర్యం, ఈశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలకు శిక్షణ

రోలుగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘ మహిళలకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 24 పంచాయతీల పరిధిలోని మహిళలకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. డీబీఎస్‌ ఫౌండేషన్‌ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ వి.నాగరాజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారం చేసే వారంతా ఉద్యమం రిజిస్ట్రేషన్‌ చేయించుకోవాలన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ డెవలప్‌మెంట్‌లో అభివృద్ధి చెందాలనే ఆసక్తి ఉన్న మహిళలకు ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఉషాదేవి, సీసీలు పాల్గొన్నారు.

గంజాయి దుష్ప్రభావంపై విద్యార్థులకు అవగాహన

» పోలీస్, ఎక్సైజ్ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

» గంజాయిపై టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచన



కుష్ఠుపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో ఎస్పీ తుహిన్ సిన్హా తదితర అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా, విక్రయం వంటి సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1972కు తెలియజేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం జిల్లాస్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు. విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి గంజాయి దుష్ప్రభావంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ గంజాయి రవాణా నిరోధానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి రోజు వారీ కేసులను నమోదు చేస్తున్నామన్నారు. పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వాహన తనిఖీలు చేపడుతున్నామని వివరించారు. సమన్వయంతో ఎన్టీఆర్ వైద్యాలయంలో 15 పడకల డీఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు

కుష్ఠు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించండి

కుష్ఠువ్యాధి లక్షణాలపై వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్-2025 పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కుష్ఠువ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు చేయాలన్నారు. ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ జరుగుతుందని, ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది పరిశీలిస్తారన్నారు. ఎవరికైనా శరీరంపై తెల్లమచ్చలు, నరాల నొప్పులు వంటి లక్షణాలు వస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, డీఎం హెచ్‌వో డాక్టర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో డిగ్రీ విద్యార్థికి కాంస్య పతకం



విద్యార్థికి అధ్యాపకుల అభినందన

సబ్బవరం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం జరిగిన అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీలలో ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కండిపల్లి జశ్వంత్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ బుధవారం కళాశాలలో ఆయనను అభినందించారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభ్యుదయ సైకిల్ యాత్ర

'పేట'లో ప్రారంభించిన హోం మంత్రి అనిత

» డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా హాజరు

» అధిక సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు, యువత

» 'మాదకద్రవ్యాలు వద్దు-జీవితమే ముద్దు' అంటూ ప్లకార్డులు ప్రదర్శన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హోం మంత్రి అనిత, వేదికపై డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా

పాయకరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల నిర్మూలన నిమిత్తం విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో పోలీసులు చేపట్టిన అభ్యుదయ సైకిల్ ర్యాలీ బుధవారం పాయకరావుపేటలో ఘనంగా ప్రారంభమైంది. రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో చిత్రమందిర్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మెయిన్ రోడ్డుకు ఇరువైపులా నిలబడిన విద్యార్థులను ఆప్యాయంగా పలుకరించారు. పలువురు చిన్నారులతో పాటు విద్యార్థులకు 'డ్రగ్స్ వద్దు బ్రో' బ్యాడ్జీలు పెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటుపడితే భవిష్యత్ ఏవిధంగా నాశనమవుతుందో వివరించారు. విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఆ తరువాత పోలీసులు నిర్వహించిన అభ్యుదయం సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా మంత్రి అనిత, డీజీపీ, ఎస్పీ సైకిల్ తొక్కుతూ అందరినీ ఆకట్టుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, స్థానిక పోలీసు అధికారులతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్, కూటమి నాయకులు పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజబాబు, చిక్కాల శ్రీను, మజ్జూరి నారాయణరావు, ఎం.రమాకుమారి, నారపురెడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో పిచ్చికుక్క స్వైరవిహారం

» 10 మందికి తీవ్ర గాయాలు

» స్థానిక పీహెచ్‌సీలో చికిత్సలు

» మెరుగైన వైద్యానికి పలువురు పిల్లలను చోడవరం ఆస్పత్రికి తరలింపు





కుక్క కాటుకు గురైన చిన్నారి, వృద్ధురాలు



బాధితులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రమ్య దుర్గ

బుచ్చెయ్యపేట నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాదిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పది మందిని గాయపర్చింది. దీంతో అంతా ఒక్కసారిగా హడలిపోయారు. ఇటీవల కాలంలో ఇక్కడ వీధి కుక్కల బెడద అధికమైంది. ఈ క్రమంలో ఓ పిచ్చికుక్క బుధవారం గ్రామమంతా సంచరించింది. కనిపించిన వారిని వెండించి మరీ కాటువేసింది. దీంతో టి.ధనశ్రీ, ఎం.నాగదేవ్, పి.వెంకటరమణ, ఎ.సత్యవతి, డి.అచ్చియ్యమ్మ, కండేల్లి నూకరత్నం, జి.అప్పారావు, పి.వెంకటరమణ మూర్తి, ఎ.భాస్కరరావు, వై.నారాయణరావు, బి.వరుణ్ కుమార్, జె.మహాలక్ష్మి తదితరులు దీని దాడిలో త్రీవంగా గాయపడ్డారు. స్థానిక పీహెచ్‌సీకి వీరు వెళ్లగా వైద్యాధికారిణి డాక్టర్ రమ్య దుర్గ సిబ్బందితో కలిసి వైద్యం అందించారు. కుక్క కాటుకు గురైన వారిలో ఎక్కువ మంది చిన్నారులు, వృద్ధులు ఉన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ కుక్క కాటుకు గురైన వారందరికీ వ్యాక్సిన్ చేశామన్నారు. చిన్న పిల్లల్లో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం కోసం చోడవరం తరలించినట్టు చెప్పారు. ఈ అంశాన్ని ఎంపీడీవో శివ ప్రసాద్ నారాయణరావుకు తెలియజేశామన్నారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, వెంటనే అధికారులు స్పందించాలని గ్రామస్థులంతా వేడుకుంటున్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి ఏడు గంటలకు ప్రత్యేక విమానంలో కడప నుంచి విశాఖ చేరుకున్నారు. ఆయనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్‌లు పి.గణబాబు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, పలు కార్పొరేషన్‌ల ఛైర్మన్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి బయలుదేరి వెళ్లారు.

ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలు



విజేతలకు పతకాలు అందిస్తున్న ఈడీ రాణిమందా

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర పరిధిలోని రుషికొండ గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా సంస్థలో జన జాతీయ గౌరవ్ దివస్ (జేజేజీడీ) 2025 ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈనెల 10 నుంచి 12 వరకు జరిగిన పోటీల్లోని విజేతలకు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమందా బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీలో బాల, బాలికల విభాగంలో చింతూరు ఐటీడీఏ, వాలీబాల్ (బాలురు) పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా, బాలికల విభాగంలో పార్వతీపురం మన్యం జిలా సీతంపేట విజేతలుగా నిలిచాయి. జావెలిన్‌త్రో బాల, బాలికల విభాగంలో పాడేరు, ఆర్చరీ బాలుర విభాగంలో పాడేరు, బాలికల విభాగంలో సీతంపేట విజయం సాధించాయి. వక్తృత్వ పోటీలో సీతంపేట, చిత్రలేఖనంలో కేఆర్‌పురం గెలుపొందాయి.

సచివాలయాలు గాడిన పడాల్సిందే..

... 5వ పేజీ తరువాయి

ఇరుకు గదుల్లోనే నడుస్తున్నాయి. ఫర్నీచర్ కొరత ఉంది. పలు సచివాలయాల్లో వాష్‌రూమ్‌లు లేక మహిళా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్లస్టర్ల విధానంలో ఉద్యోగుల సర్దుబాటు చేసినా సచివాలయాల్లో సిబ్బంది కొరత తీరకపోవడంతో ప్రజలకు సరిగా సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సచివాలయాల్లో ప్రధాన సమస్యలు

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది కొరత సమస్య ప్రధానంగా ఉంది. క్లస్టర్ విధానం అమలు చేస్తున్న నేపథ్యంలో ఒక ఉద్యోగి రెండు, మూడు సచివాలయాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పలు సచివాలయాల్లో కంప్యూటర్లు మరమ్మతులగు గురై మూలకు చేరాయి. గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా సచివాలయాలు ఉన్నందున సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. మండల కేంద్రాలు, సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రజలకు సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. సచివాలయాల సిబ్బందికి తరచూ సంబంధిత శాఖల అధికారులు సమావేశాలు పెడుతుండడంతో మండల కార్యాలయాలకు వెళుతున్నారు. సచివాలయాల్లో అరకొర సిబ్బంది ఉండగా సమావేశాల పేరుతో సిబ్బంది నిత్యం మండల కేంద్రాలకు వెళ్లిపోతుండడంతో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. కొన్ని చోట్ల నలుగురు సిబ్బందిలో ఒకరు లేదా ఇద్దరు మాత్రమే కార్యాలయంలో ఉంటు న్నారు. మిగిలిన సిబ్బంది క్షేత్ర పర్యటనల పేరుతో అందుబాటులో ఉండడం లేదు.

తల్లి, ఆరు నెలల పసికందు మృతి

... 5వ పేజీ తరువాయి

సమయంలో ఇంటికి వచ్చేసరికి తలుపులు మూసి ఉన్నాయి. తలుపు కొట్టినా ఎంతసేపటికీ తీయకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిచారు. అందరూ కలిసి తలుపులు తెరిచి లోపలకు ప్రవేశించారు. ఇంట్లో వీణ ఉరిపోసుకుని ఉండగా, బాబు అచేతనంగా పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఉమామహేశ్వరరావు పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలసకు చెందినవారు కాగా, ఆయన భార్య కూడా ఆ ప్రాంతానికి చెందిన వారని సమాచారం. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా వీణ తన బిడ్డను చంపి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఘటనకు సంబంధించి ఆమె తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించారు.

ప్రేమ పేరిట వల

... 5వ పేజీ తరువాయి

తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు.

● నర్సీపట్నం మునిసిపాలిటీలో గంగాధర్ థియేటర్ ఏరియాలో నివాసం ఉంటున్న ఆవుపాటి చరణ్‌తేజ పదిహేడేళ్ల బాలికను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో పట్టణ పోలీసులు అతనిపై బాల్య వివాహం నిరోధక చట్టం, పోక్సో, ఎస్సీ ఎస్టీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు.

● నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలో పెదబొడ్డేపల్లిలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికకు, ఎస్సీ కాలనీకి చెందిన ఓ యువకుడితో కొన్ని నెలల క్రితం పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా బాలిక గర్భవతి అయ్యే వరకు వచ్చింది. దీంతో బాలిక బంధువు ఇచ్చిన ఫిర్యాదుతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

● గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధి రామచంద్రాపురంలో ఒక జులాయి ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలిక కళాశాల బస్సులో వెళుతుంటే బైక్‌పై వెంట పడేవాడు. ఒకానొక సమయంలో బాలిక ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో బాలిక తల్లి చూసి కేకలు పెట్టింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ యువకుడిపై కృష్ణాదేవిపేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ మీద బయటకు వదిలారు. ఆ యువకుడు బయట తిరుగుతున్నాడని తెలిసి కుటుంబ సభ్యులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పుడు ఆ విద్యార్థిని నెల రోజులుగా కళాశాలకు వెళ్లడం మానేసింది. బాలికతో పాటు తల్లిదండ్రుకు కంటి మీద కునుకు లేకుండా పోయింది.

● నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుడు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న బాలికను ఉద్దేశించి మాజీ ప్రియురాలిలా ఉంటావని, తనను ప్రేమించాలని వాట్సాప్‌కి మెసేజ్ పెట్టాడు. విద్యార్థిని ధైర్యంగా ముందుకు వచ్చి విద్యార్థి సంఘాలకు, అధ్యాపకులకు జరిగింది చెప్పింది. అతిథి అధ్యాపకుడిని కళాశాల నుంచి బయటకు పంపితేగాని తాను కళాశాలకు రానని తెగేసి చెప్పింది. దీంతో అతిథి అధ్యాపకుడు ఉద్యోగం పోవడంతో పాటు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపించారు.

తల్లిదండ్రుల బాధ్యత కీలకం



బాలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. 13 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఎంతో కీలకం. పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలన్నా, పాడవ్వాలన్నా ఈ వయస్సే కారణం. ఈ వయస్సులో దాటిపోతే వారిలో ఆలోచనా శక్తి పెరుగుతుంది. పరిపక్వత వచ్చి మంచీ చెడూ అర్థం చేసుకుంటారు. పాఠశాల, కళాశాల నుంచి బాలికలు ఇంటికి వచ్చిన తరువాత తల్లిదండ్రులు వారితో కాసేపు మాట్లాడుతుండాలి. ఒక లక్ష్యాన్ని నిర్దేశించి బాగా చదవమని ప్రోత్సహించాలి. రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసులు ఐదు వరకు నమోదు చేశాం. శక్తి టీమ్‌లు పని చేస్తున్నాయి. హై స్కూళ్లు, కళాశాలలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు పెడుతున్నాం.

- రేవతమ్మ, రూరల్ సీఐ, నర్సీపట్నం

క్రైం... crime news

పెద్దేరు నదిలో యువకుడి గల్లంతు



నాగ అప్పారావు (ఫైల్)

బుచ్చెయ్యపేట నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెద్దేరు నదిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. మండలంలోని వడ్డాది గ్రామానికి చెందిన మెగ్గ నాగ అప్పారావు మంగళవారం చేపల వేటకు నదిలోకి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యుల ఆందోళన చెందారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో బుధవారం సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఫలిత కానరాలేదు. దీంతో అతని కుటుంబ సభ్యుల ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థిని పట్ల అభ్యంతరకర ప్రవర్తన

» సంస్కృతి గ్లోబల్ పాఠశాల ఛైర్మన్‌పై పోలీసులకు ఫిర్యాదు

» పోక్సో చట్టం కింద కేసు నమోదు

పరవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ మండలంలోని పి.బోనంగిలో గల సంస్కృతి గ్లోబల్ పాఠశాల ఛైర్మన్‌పై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు బుధవారం తెలిపిన వివరాలివి. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలానికి చెందిన ఓ విద్యార్థిని పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ అక్కడే గల హాస్టల్‌లో ఉంటుంది. సదరు విద్యార్థిని పట్ల పాఠశాల ఛైర్మన్ గత కొంతకాలంగా అనుచితంగా ప్రవర్తించేవారు. ఈ క్రమంలో ఈ నెల ఎనిమిదవ తేదీన ఉదయం ఆరున్నర గంటలకు ఛైర్మన్ బాధిత విద్యార్థినితో పాటు మరో ఆరుగురు విద్యార్థినిలను తన క్యాబిన్‌కు పిలిపించుకుని అకారణంగా తిట్టినట్టు ఆ ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. ఈ క్రమంలో బాధిత విద్యార్థిని తమను ఎందుకు తిడుతున్నావు అంటూ ఛైర్మన్‌ను ప్రశ్నించగా, కోపోద్రిక్తుడైన ఛైర్మన్ సదరు విద్యార్థినిని చెంపపై బలంగా కొట్టారని ఆ ఫిర్యాదులో తెలిపినట్టు సీఐ చెప్పారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ ట్యూటర్ బాధిత విద్యార్థినిని ఓదార్చడానికి ప్రయత్నించినప్పటికీ ఛైర్మన్ అతనిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. కాగా బాధిత విద్యార్థిని తండ్రి ఈ నెల తొమ్మిదో తేదీన పాఠశాలకు వెళ్లగా జరిగిన విషయాన్ని తండ్రికి ఏడుస్తూ వివరించింది. దీంతో అతను ఛైర్మన్‌ను ప్రశ్నించగా, అతనిపై కూడా ఆయన తిట్ల దండకం మొదలు పెట్టారని సీఐ వివరించారు. దీంతో విద్యార్థిని తండ్రి ఈ నెల 10వ తేదీన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు తాను, ట్రైనీ ఎస్ఐ విజయకుమారి పాఠశాలకు వెళ్లి విచారణ జరిపినట్టు సీఐ చెప్పారు. బాధితురాలు మైనర్ కావడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు.

బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి బుధవారం పోలీసులు తెలిపిన వివరాలివి. పట్టణంలోని పెదబొడ్డేపల్లికి చెందిన పద్నాలుగు సంవత్సరాల బాలిక పాఠశాలకు వెళుతున్నానని చెప్పి ఈ నెల ఏడో తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మంగళవారం తిరిగి ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులు ఎక్కడకు వెళ్లావని ఆమెను నిలదీయగా జరిగిన విషయం చెప్పింది. పెదబొడేపల్లి చెందిన పూడి చరణ్ కారణంగా ఆ బాలిక గర్భవతిగా ఉన్నట్టు తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, డీఎస్పీ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ఏసీబీకి పట్టుబడిన వీఆర్వోకు రిమాండ్

దేవరాపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం.అలమండ వీఆర్వో చుక్కా సూర్యనారాయణ ఏసీబీకి పట్టుబడడంతో ఈ నెల 26 వరకు అవినీతి నిరోధక శాఖ న్యాయస్థానం రిమాండ్ విధించినట్టు ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి బుధవారం తెలిపారు. రైతుకు మ్యూటేషన్ సర్టిఫికెట్ ఇవ్వడానికి రూ.20 వేలు లంచం తీసుకుంటూ అ.ని.శా.కు మంగళవారం సూర్యనారాయణ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ మేరకు న్యాయస్థానం రిమాండ్ విధించినట్టు చెప్పారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

సీపీఐ నేత మాకిరెడ్డి బలవన్మరణం

... 5వ పేజీ తరువాయి

కార్యదర్శివర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు డీసీహెచ్ క్రాంతి, సీపీఐ నాయకులు గురుబాబు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శివలంక గొండలరావు ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంత్యక్రియలు చోద్యంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

డాక్‌యార్డ్ వంతెనపై రయ్ రయ్!

» ప్రారంభమైన సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జి



వంతెనపై నుంచి వాహనాలు వెళ్తున్న దృశ్యం

మల్కాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేవల్ డాక్‌యార్డు సమీపం లోని సర్దార్ వల్లాభాయ్ పటేల్ వంతనపై బుధవారం ఉదయం 5 గంటల నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, ఆటో, కార్లను మాత్రమే అనుమతించారు. బ్రిడ్జి పునర్నిర్మాణం నిమిత్తం మూసివేసిన 15 నెలల అనంతరం తిరిగి ప్రారంభం కావడంతో పారిశ్రామిక ప్రాంత వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతం నుంచి నగరానికి చేరుకునేందుకు ఈ వంతెన పైనుంచి ఎస్ఆర్ కంపెనీ, కాన్వెంట్ కూడలికి మీదుగా ప్రయాణించాలి. నగరం నుంచి వచ్చే వారు జ్ఞానాపురం మార్గంలోకి చేరుకొని రామ్మూర్తి పంతుల పేటకు సమీపంలో డాక్‌యార్డు క్వార్టర్స్ మార్గంలో వంతెన కింద నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్, అక్కడి నుంచి వంతెన మీదుగా చేరుకుంటున్నారు. కాగా వంతెన సమీపంలోని షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) వద్ద భారీగా దుమ్ము రేగుతుండడంతో ప్రయణికులు తీవ్ర ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నారు. సాగర మాల పథకంలో భాగంగా కాన్వెంట్ నుంచి డాక్‌యార్డుకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం పోర్టు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ వంతెను అందుబాటులోకి వస్తే బస్సుల రాకపోకలను పునరుద్ధరించే అవకాశం ఉంటుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594